నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
బుధవారం | 04 డిసెంబర్ 2024 | www.navatelangana.com

ప్రజలకు విద్య వైద్యం ప్రభుత్వ లక్ష్యం

- కార్మికుల సంక్షేమం ముఖ్యం
- జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



నవతెలంగాణ-మెదక్

కార్మికులు అనారోగ్య సమస్యలతో బాధపడితే తన దృష్టికి తేవాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. మున్సిపాలిటీ కార్యాలయంలోమున్సిపల్ శానిటేషన్ మున్సిపల్ కార్మికులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ ప్రభుత్వం విశేష కృషి చేస్తుందన్నారు. జిల్లాలో ప్రజాపాలన విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ప్రభుత్వం నిధులు వెచ్చిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ చంద్రపాల్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ సంధ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీరామ్ నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో ప్రజలందరిలో అసంతృప్తి

నవతెలంగాణ-సంగారెడ్డి



కాంగ్రెస్ పాలనలో ప్రజలందరూ అసంతృప్తితో ఉన్నారని సంగారెడ్డి శాసనసభ్యులు చింతా ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడిచిన యాడాది పాలనలో రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ ఒరగబెట్టిందేమీ లేదని దుయ్యబట్టారు. ఏడాది కాలంలోనే రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిండా ముంచిందన్నారు. రెండు లక్షల రుణమాఫీకి ఎగనామం పెట్టిందని మండిపడ్డారు. వడ్లకు బోనస్ బోగస్ అయిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 100 రోజుల్లోనే ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పినా.. ఏడాది గడిచినా అమలు చేయడం లేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే... కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా కుట్రలు చేస్తున్నదన్నారు.

నేడు సంగారెడ్డికి ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య విచారణ కమిషన్ రాక

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లాకు నేడు ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటు చేసిన ఏకసభ్య విచారణ కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీం అక్తర్ వస్తున్నట్టు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణ పై వివరణాత్మక అధ్యాయనం కోసం ఉమ్మడి మెదక్ జిల్లా సంగారెడ్డి, మెదక్, సిద్ది పేట పరిధిలో బహిరంగ విచారణ సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు డాక్టర్ జస్టిస్ షమీం అక్తర్, కమిషన్ సభ్యులు వినతులు స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఎస్సీ కులాల సంఘం నాయకులు అధిక సంఖ్యలో బహిరంగ విచారణకు హాజరై తమ తమ వినతులను అందించాలని షెడ్యూల్ కులాల సంఘ నాయకు లను కోరారు.

కనీస వేతనాలకు నోచుకోని కార్మికులు







- కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలు
- సీఐటీయూ ఉన్న చోట కార్మికులకు న్యాయం
- కార్మికుల పక్షాన ఉద్యమిస్తున్న సీఐటీయూ
- పట్టించుకోని కార్మిక శాఖ అధికారులు

నవతెలంగాణ-మనోహరాబాద్

పరిశ్రమల యాజమాన్యాలు కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తుండడంతో కార్మికులు కనీస వేతనాలకు నోచుకోక వెట్టిచాకిరికి గురౌతున్నారు. కార్మికుల పక్షాన ఉండి వారి హక్కుల సాధనకు నిరంతరం సీఐటీయూ ఉద్యమిస్తున్నది. మనోహరాబాద్ మండలంలోని ముప్పిరెడ్డిపల్లి, కాళ్ళాకల్, జీడిపల్లి, కూచారం తదితర గ్రామాల శివారులో సుమారు వందల సంఖ్యలో పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో భారత దేశంలోని ప్రతి రాష్ట్రం నుంచి అనేక రాష్ట్రాలకు చెందిన కార్మికులు వలస వచ్చి ఇక్కడి పరిశ్రమల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. పరిశ్రమల యాజమాన్యాలు కార్మికులకు కనీస వేతనాలను ఇవ్వకుండా, కార్మిక చట్టాలను పట్టించుకోక పోవడంతో కార్మికులు శ్రమదోపిడికి గురౌతున్నారు. పరిశ్రమలలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఉద్యోగాలు, కూలీ పనులు చేస్తున్నారు. వారికి కార్మిక చట్టాలపై అవగాహన లేకపోవడంతో వారితో పరిశ్రమల యాజమాన్యాలు పన్నెండు గంటల పాటు పనులు చేయిస్తూ శ్రమదోపిడికి పాల్పడుతున్నారు.

సీఐటీయూ ఉద్యమాలతో కార్మికులకు న్యాయం

పరిశ్రమలలో సీఐటీయూ యూనియన్లు దగ్గరుండి కార్మికుల కోసం ఉద్యమిస్తుండడంతో కార్మికులకు న్యాయం జరుగుతుందని కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఇతర కార్మిక యూనియన్లు ఉన్నదగ్గర కార్మికులకు కనీస వేతనాలు కూడా అమలు కాని పరిస్థితి నెలకొంటుంది. కార్మిక చట్టాల ప్రకారం కార్మికుని చేత 8 గంటల పనులు మాత్రమే చేయించాల్సి ఉండగా వారి నుంచి పరిశ్రమల యాజమాన్యాలు 12 గంటల పాటు వెట్టి చాకిరి చేయించుకుంటున్నారు. కార్మిక చట్టాలను ఉల్లంఘించి కార్మికుల చేత వెట్టిచాకిరి చేయిస్తున్నప్పటికి కార్మిక శాఖ అధికారులు కానీ లేబర్ అధికారులు కానీ పట్టించుకోకపోవడంతో కార్మికులు పూర్తి స్థాయిలో శ్రమదోపిడికి గురౌతున్నారు. గతంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు ప్రమాదాలు జరిగి మృత్యువాత పడితే పరిశ్రమల యాజమాన్యాలు గుట్టుచప్పుడు కాకుండా దహనసంస్కారాలు కూడా చేపడుతున్నట్టు సీఐటీయూ యూనియన్ల నాయకులు పలు మార్లు ఆరోపణలు చేసినా పట్టించుకోకపోడంతో కార్మిక శాఖ ఏ మేరకు పనులు చేస్తున్నారో అర్థమవుతుంది.

కార్మికులకు కనీస సౌకర్యాలు కరువు

కార్మికులు వెట్టి చాకిరికి గురౌతున్నా అధికారులు చర్యలు చేపట్టిన దాఖలాల కూడా కనిపించడంలేదు. పరిశ్రమలలో కార్మిక చట్టాలను ఉల్లంఘించడంతో పాటు కార్మికులకు కనీస సౌకర్యాలు, సేఫ్టీ ప్రికాషన్స్ పరికరాలను అందించడం, పనికి తగిన వేతనాలను ఇవ్వడం, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను కల్పిండంలో పరిశ్రమల యాజమాన్యాలు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుండడంతో కార్మికులకు ప్రమాదాలు జరిగితే నష్టపోయే పరిస్థితి నెలకొంది. సీఐటీయూ యూనియన్లు ఉన్న దగ్గర కార్మికుల శ్రేయస్సు కోసం వారి పనికి తగిన వేతనాలు, సేఫ్టి పరికరాలను, ఈఎస్ఐ. పీఎఫ్ సౌకర్యాలను కల్పించాలంటూ ఉద్యమాలు చేపడుతుండడంతో కార్మికులకు న్యాయం జరిగే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా కార్మిక చట్టాలను ఉల్లంఘించే పరిశ్రమలపై కార్మిక శాఖల అధికారులు దాడులు నిర్వహించి కార్మికులకు చట్టప్రకారం రావాల్సిన సౌకర్యాలను అందించడంతో పాటు చట్టాలను ఉల్లంఘించే పరిశ్రమలపై చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలంటూ కార్మికులు కోరుతున్నారు.

భెల్‌లో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం



నవతెలంగాణ -రామచంద్రాపురం

రామచంద్రాపురంలోని నవరత్న కంపెనీల్లో ఒకటైన భెల్ కంపెనీ యాజమాన్యం ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేబీ రాజా, జనరల్ మేనేజర్ శ్రీనివాసరావులు హాజరై దివ్యాంగులకు అవసరమైన వస్తువులను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఈడీ కెబీ రాజా మాట్లాడుతూ.. దివ్యాంగులను సమాజంలో గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు, డిఆర్ఓలు, సీనియర్ అధికారులు, యూనియన్ నాయకులు, అసోసియేషన్ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

భెల్‌లో రక్తదాన శిబిరం

నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురంలోని భెల్ టౌన్షిప్‌లో భెల్ టౌన్షిప్ అడ్మినిస్ట్రేషన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కలిసి రక్తదాన శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో యువకులు ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెబీ రాజా రక్త దాతలను అభినందించారు. యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని తద్వారా ఎందరికో ప్రాణదానం చేసిన వారవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సురాణ ప్రసాద్, హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ అధికారులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జోగిపేటలో ప్రజా పాలన విజయోత్సవాలు



నవతెలంగాణ-జోగిపేట

అందోల్-జోగిపేట్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రజా పాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని క్లాక్ టవర్ నుంచి ప్రధాన రహదారిలో ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పురపాలక సంఘము వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిభిరంలో సిబ్బందికి ఉచిత వైద్య పరిక్షలు నిర్వహించి వారికీ అవసరమైన మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో పాండు, మున్సిపల్ చైర్మెన్ మల్లయ్య, కమిషనర్ సి.హెచ్.తిరుపతి, వైస్ చైర్మెన్ ప్రవీణ్, కౌన్సిలర్లు ఎస్.సురేందర్‌గౌడ్, ఆకుల చిట్టిబాబు, డాకూరి శంకర్, పట్లోల్ల రేఖా ప్రవీణ్, రంగ సురేష్, కోరబోయిన నాగరాజు, దుర్గేశ్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ బ్యాటరీ నిందితులను అరెస్టు

ఆరుగురు నిందితులను అరెస్టు, నగదు, బ్యాటరీలు, సెల్‌ఫోన్లు స్వాధీనం


నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్



సెల్ టవర్ బ్యాటరీలను చోరీ చేస్తున్న ఆరుగురు వ్యక్తులను గజ్వేల్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం వారి వద్ద నుంచి రూ. 98వేలు నగదు, బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ సైదా విలేకరులతో మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, మంచిర్యాల జిల్లా, నుంచి ఆరుగురు వ్యక్తులు ఫిల్టర్ బ్యాటరీలను దొంగతనం చేసేందుకు పనిగా పెట్టుకున్నారు. ఈజీ మనీకి అలవాటు పడిన వీరు టవర్ బ్యాటరీలు దొంగిలించి సిద్దిపేట జిల్లా దుద్దెడ సంబంధించిన వ్యక్తికి అమ్ముతున్నారని పేర్కొన్నారు. దొంగతనం చేసిన వారిలో బదావత్ కృష్ణ, బానోతు సతీష్, ఇస్లావత్ రమేష్, లావుడియా శంకర్, ఉన్నారు. వీరితోపాటు ఒక మైనర్ అబ్బాయి ఈ దొంగతనంలో ఉన్నారు. గజ్వేల్ పోలీస్ అధికారులు నిఘా పెట్టి టెక్నాలజీతో చాకచక్యంగా సెల్ టవర్ బాటరీ దొంగతనం నిందితులను పట్టుకున్నారు. వీరు సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్, కుకునూరుపల్లి, ములుగు, పోలీస్ స్టేషన్స్, మెదక్ జిల్లాలోని చేగుంట, శివంపేట్, మనోహరాబాద్, పోలీస్ స్టేషన్స్, వీరిపై కేసులు ఉన్నాయన్నారు. అంతేకాకుండా సైబరాబాద్ లోని షామీర్ పెట్, శంషాబాద్ పోలీస్ స్టేషన్స్‌మొత్తం 11 కేసులలో జ్యుడిషియల్ రిమాండ్ కు తరలించండం జరిగిందన్నారు. బదావత్ కృష్ణ అతని కొడుకు అఖిల్ హైదరాబాద్ లోనే ఉన్నాడు. గత నాలుగు నెలల క్రితం అతని బంధువులు రమేష్, శంకర్, సతీష్ లు హైదరాబాద్ కు పని నిమిత్తం వచ్చారు. వారితో సులబంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో గతంలో టవర్ లకు సంబందించిన బ్యాటరీ లను టవర్ ల దగ్గరకు ట్రాన్స్పోర్ట్ చేసేవాడు. దానిని దుద్దెడ లింగం స్క్రాప్ షాప్, తుర్కపల్లి స్క్రాప్ షాపు వద్ద అమ్ముతున్నట్లు తెలిపారన్నారు. చాకచక్యంగా సెల్ టవర్ బాటరీ దొంగతనం నిందితులను పట్టుకున్న గజ్వేల్ ఇన్స్పెక్టర్లు సైదా, చెట్టుక్రింద ముత్యం రాజు అడిషనల్ ఇన్స్పెక్టర్,యాదగిరి రెడ్డి, ఎస్సై ఆఫ్ పోలీస్ యాదగిరి, నవీన్ కుమార్, రవి, నరేందర్, వెంకటేష్ లను పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ,గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి అభినందించారు. త్వరలో రివార్డ్ అందజేయడం జరుగుతుందని తెలిపారు.

రోడ్డు దాటుతుండగా బస్సు ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-నార్సింగి



బస్సు ఢీ కొట్టిన దుర్ఘటనలో వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి 7:30 గంటల ప్రాంతంలో వల్లూరు గ్రామానికి చెందిన వడ్ల రమేష్ (45) జాతీయ రహదారి 44పై వల్లూరు గ్రామం వద్ద తన సైకిల్‌పై రోడ్డు దాటుతున్నాడు. హైదరాబాద్ వైపు వెళుతున్న బస్సు బలంగా వచ్చి ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడిన రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించి, మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సిద్దిపేట జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేయాలి

- చేర్యాల, దుబ్బాకలను రెవిన్యూ డివిజన్లు చేయాలి
- భూనిర్వాసితులను ఆదుకోవాలి
- యువతకు ఉపాధి కల్పించాలి
- అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి
- ప్రజా సమస్యల పరిష్కారానికి బలమైన ఉద్యమాలు



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

సిద్దిపేట జిల్లాలో ఉన్న వనరులను ఉపయోగించుకొని జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేయాలని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడారు. గజ్వేల్‌లో డిసెంబర్ 1,2 తేదిల్లో జరిగిన సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా మహసభల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పలు తీర్మానాలను ఆమోదించిందని తెలిపారు. సిద్దిపేట జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేయాలని జిల్లాలో ఉన్న వనరులను ఉపయోగించి పారిశ్రామికంగా, వ్యవసాయకంగా అభివృద్ధి చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. చేర్యాల, దుబ్బాకలను రెవిన్యూ డివిజన్‌గా ప్రకటించాలని, జిల్లాలో ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన నిర్వాసితులను ఆదుకోవాలని, వారికి అందాల్సిన పరిహారాలు మొత్తం చెల్లించాలని కోరారు. నివాస ప్రాంతాలలో నిర్వాసితులకు సౌకర్యాలు కల్పించాలని, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. జిల్లాలో రైతాంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు ధీటుగా ఎదుర్కొని సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటాలు చేయాలని, తదితర సమస్యలను సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిందన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రానున్న కాలంలో బలమైన ఉద్యమాలు, పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, రాళ్లబండి శశిధర్, సందబోయిన ఎల్లయ్య, శెట్టిపల్లి సత్తిరెడ్డి, గొడ్డుబర్ల భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, జాలిగాపు శిరీషలు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసిన టాస్క్ పోర్స్ పోలీసులు

-రూ.1,04, 833లు స్వాధీనం

నవతెలంగాణ-జగదేవపూర్



జగదేవపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గొల్లపల్లి గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు కలసి పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారంపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, జగదేవపూర్ పోలీసులతో కలసి వెళ్లి రైడ్ చేయగా 08 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1,04,833లు, 09 మొబైల్ ఫోన్లు, 1 మోటార్ సైకిల్, 2 కార్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడిన. వారిలో భీమ్ యెల్లం, సామల కుమార్, కర్రే రాము, వట్టిపల్లి శ్రీనివాస్ ,చిత్తరాల యాదగిరి, కొంపల్లి నర్సింలు, విరపట్నం స్వామి, జెపల్ల రాములు ఉన్నారు. పారిపోయిన వారిలో మధు, ప్రవీణ్ పోచయ్యలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ అధికారులు, గజ్వేల్ పోలీసులు మాట్లాడుతూ గ్రామాలలో, పట్టణాలలో ఫామ్ హౌస్‌లలో, ఇళ్ళల్లో పేకాట, బహిరంగ ప్రదేశంలో జూదం మరే ఇతర చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే లేదా ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నటు సమాచారం ఉంటే వెంటనే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

వాసవి మా ఇల్లు సేవలు అభినందనీయం

టీజీ ఐఐసీ చైర్మెన్ నిర్మల జగ్గారెడ్డి

నవతెలంగాణ-సంగారెడ్డి



పేద ప్రజల కోసం వాసవి మా ఇల్లు చేస్తున్న సేవలు అభినందనీయమని టీజీ ఐఐసీ చైర్మెన్ నిర్మల రెడ్డి అన్నారు. వాసవి మా ఇల్లు సంస్థ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో 1100 మంది వసతి గృహ విద్యార్థులకు మంగళవారం దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ.. వాసవి మా ఇల్లు వ్యవస్థాపకులు తోపాజి అనంత కిషన్ సేవలు అభినందనీయమన్నారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ.. వసతి విద్యార్థుల కోసం వాసవి మా ఇల్లు సంస్థ ఉచితంగా దుప్పట్లను పంపిణీ చేయడాన్ని కొనియాడారు. ఇదేస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. వ్యవస్థాపకులు తోపాజి అనంత కిషన్ మాట్లాడుతూ.. వాసవి మా ఇల్లు చేసిన సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కడం తనకు ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలను చేస్తామన్నారు. సంస్థకు వచ్చిన జాతీయ గుర్తింపు పత్రాన్ని టీజీఐఐసి చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి చేతుల మీదుగా తోపాజి అనంత కిషన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మాధురి, సంస్థ ప్రధాన కార్యదర్శి పుల్లూరి ప్రకాష్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొంపల్లి విద్యాసాగర్, వర్తక సంగం పట్టణ అధ్యక్షుడు పాండురంగం, కార్యదర్శి మదన్మోహన్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కూన, సంతోష్ కుమార్, కౌన్సిలర్ నాగరాజు, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో 'సీఎం కప్-2కె రన్'



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిర్వహించిన సీఎం కప్- 2కె రన్‌ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. సంగారెడ్డి ఐబి నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు ఉత్సాహంగా ఈ రన్ సాగింది. ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడం, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రారంభానికి ముందు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రజలలో సామూహిక ఉత్తేజాన్ని కలిగించే విధంగా ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఆరోగ్యంతో కూడిన జీవనశైలిని అలవర్చుకోవడం ప్రస్తుత తరుణంలో అత్యంత అవసరమన్నారు. యువతలో ఉత్తేజాన్ని పెంచే విధంగా ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలన్నారు. ప్రజల సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రైయినీ కలెక్టర్ మనోజ్, సంగారెడ్డి ఆర్డీవో రవీందర్ రెడ్డి, జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి ఖాసీం బేగ్, తహసీల్దార్ దేవదాస్, టీజీ ఈజెఏసి చైర్మెన్ ఎండి జావీద్ అలీ, ఇతర అధికారులు, వివిధ యువజన సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

వడ్డీలేని రుణాలతో చిరు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

నవతెలంగాణ-జహీరాబాద్



రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న వడ్డీలేని రుణాలతో మహిళలు చిరు వ్యాపారాల్లో వ్యాపారవేత్తలుగా ఎదగాలని మాజీ కౌన్సిలర్ పి.రాములు నేత అన్నారు. జహీరాబాద్ పట్టణం శాంతినగర్‌లోని మంగళవారం జరిగిన సఖి స్లం సమైక్య విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా పొదుపు సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న పావలా వడ్డీ రుణాలతో సమిష్టిగా వ్యాపారాలను ప్రారంభించి వ్యాపారవేత్తలుగా తయారు కావాలన్నారు. అదేవిధంగా జహీరాబాద్ పట్టణాన్ని దేశంలోనే ఆర్థిక అభివృద్ధి పట్టణంగా తీర్చిదిద్దుటకు కృషి చేయాలన్నారు. మహిళలు ఖాళీ సమయాల్లో తమ పరిసర ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో పూల మొక్కలు, పళ్ళ మొక్కలు, తీగ కూరలు, కాయకూరలు, ఆకుకూరలు లాంటివి పెంచుకోవాలన్నారు. ఇలాంటి పేరటి మొక్కలతో ఆర్థిక పరిస్థితి మెరుగుపడి కొద్ది మేరకు ఖర్చు తగ్గుతుందన్నారు. ఖాళీ సమయాల్లో చదువుకున్న ఒక మహిళ చదువురాని ఇంకొక మహిళకు చదువు నేర్పి పూర్తిస్థాయి అక్షరాస్యతను సాధించడానికి కృషి చేయాన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు అనిత, సఖి స్లం సమైక్య ఆర్పి మాధవి, సఖిస్లం సమైక్య నూతన అధ్యక్షురాలు వహీదా బేగం, కార్యవర్గ సభ్యులు అఫ్రోజ్, రాయిపల్లి సుష్మ, శ్రావణి, బాగిల్ కేర్ మీరా తదితరులు పాల్గొన్నారు.

పలు నకిలీ వైద్యుల క్లినిక్లపై తనిఖీలు

నవతెలంగాణ-చేర్యాల



తెలంగాణా వైద్య మండలి సభ్యులు డాక్టర్ బండారి రాజ్ కుమార్ ఎథిక్స్ కమిటీ మెంబర్ ఆధ్వర్యంలో ని యాంటీ క్వేకరి బృందం మంగళవారం చేర్యాల మండలంలోని పలు నకిలీ వైద్యుల క్లినిక్లపై తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ తనిఖీల్లో చేర్యాల పట్టణ కేంద్రంలోని పెద్దమ్మగడ్డ ఏరియాలో నకిలీ వైద్యులు రామచంద్రం, భాస్కర్, మద్దూర్‌లో శ్రీశైలం క్లినిక్స్ నిర్వహిస్తూ ఆంటీబయాటికులు స్టెరాయిడ్లు ఇస్తున్నారని గుర్తించామన్నారు. వీటితోపాటు వెంకట సాయి హాస్పిటల్, అక్షర హాస్పిటల్‌ని సందర్శించామని, క్వాలిఫైడ్, తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వైద్యులతోనే వైద్యం చేయించాలని, క్వాలిఫైడ్ కానీ వ్యక్తులతో వైద్యం చేయించకూడదని సలహా ఇచ్చామన్నారు. ఎన్ఎంసీ చట్టం 34,54 ప్రకారం వీరిపై కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఎన్ఎంసి చట్టం ప్రకారం విద్యార్హత లేకున్నా అల్లోపతి వైద్యం చేసినందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయనున్నారు. ఇలాంటి నకిలీ వైద్యులపై ఇప్పటివరకు 400 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని త్వరలో కోర్టులో హాజరు పరిచి చట్టపరంగా శిక్షించబడతారని పేర్కొన్నారు. చట్ట ప్రకారం అర్హత లేని వ్యక్తులకు ట్రైనింగ్ ఇవ్వడం, ప్రాక్టీస్ చేయడం చట్ట విరుద్ధం అని గతంలో కూడా దేశంలో ఎక్కడ లేని విధంగా పలు సార్లు జీవోలు ఇవ్వగా కోర్టు లు ఆ జీవోలను రద్దు చేసిందని గుర్తు చేశారు. త్వరలో వీరందరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి కఠినంగా శిక్షించబడతారన్నారు. ఈ తనిఖీల్లో టీజీఎంసి మెంబర్ డాక్టర్ రాజకుమార్, హెచ్‌ఆర్‌డీఏ జనరల్ సెక్రెటరీ డాక్టర్ గౌతమ్ సహ ఇతర యాంటీ క్వాకరి బృందం పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

జోగిపేట ఆర్డీఓ పాండు

నవతెలంగాణ-జోగిపేట

మానసిక ఉల్లాసానికి క్రీడలు విద్యార్థులకు ఎంతో దోహదపడతాయని అందోలు-జోగిపేట ఆర్డీఓ పాండు అన్నారు. జోగిపేట ప్రైవేట్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జోగిపేటలోని డాన్‌బాస్కో పాఠశాలలో మంగళవారం క్రీడోత్సవాలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. తనకు క్రికెట్ ఆట అంటే చాలా ఇష్టమని, 1983లో మొదటిసారి ఇండియా వరల్డ్ కప్ సాధించినప్పటి నుంచి తాను క్రికెట్‌కు అభిమానిగా మారిపోయానన్నారు. తన విద్యాభ్యాసం నిజాం కళాశాలలో జరిగిందని, అప్పట్లో మాజీ ఇండియా కెప్టెన్ అజహరొద్దీన్ ఆటను దగ్గరగా చూడగలిగానన్నారు. ఇప్పటికి కూడా ప్రతి రోజు క్రికెట్‌తో పాటు వాకింగ్, యోగా చేస్తానన్నారు. క్రీడా కారులు విద్యలో కూడా ముందుంటారన్నారు. మనిషికి శారీరధాండ్యత తప్పనిసరి అన్నారు. మండల విద్యాధికారి బం డి కృష్ణ మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రైవేట్ పాఠశా లల న్నీ ఒకే వేదిక మీదకురావడం, క్రీడలు నిర్వహించడం అభిన ందనీయమన్నారు.ప్రభుత్వం తరపున నిర్వహించే ఎస్ జీఎ ఫ్ క్రీడల్లో కూడా ప్రైవేట్ పాఠశాలలు కూడా భాగసా్వము లు కావాలన్నారు.పోటీల్లోగెలుపు ఓటములు సహజమేనన్నారు.



జోగిపేటలో క్రీడలు ప్రారంభం

జోప్సా ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలను ఆర్డీఓ పాండు ప్రారంభించారు. క్రీడోత్సవాల్లో భాగంగా జ్యోతిని వెలిగించి క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ పోటీల్లో 8 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జోప్సా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దాసరి నాగేశ్వరరావు, ఉపాధ్యాక్షుడు రుపస్, కోశాధికారి వెంకటేశం, సహయ కార్యదర్శి రామకృష్ణ, డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, లయన్స్‌క్లబ్ జిల్లా కార్యదర్శి, అందోలు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఆకుల రాంబాబు, ఫిజికల్ డైరెక్టర్ వీబీ శ్రీనివాస్‌లతో పాటు వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువుల మునిగి వ్యక్తి మృతి

నవతెలంగాణ-హవేలిఘనపూర్



ప్రమాదవశాత్తు చెరువులో చేపల వేటకు వెళ్లి నీటిలో మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. హవేలి ఘనపూర్ ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాలు ప్రకారం మెదక్ పట్టణంలోని అవుసులపల్లికి వార్డుకు చెందిన సున్నం ఏసయ్య (46) మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం మృతుడు ఏసయ్య చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం వల తీసుకుని హవేలిఘనపూర్ మండల పరిధి ఔరంగాబాద్ ఊరు చెరువులో చేపలు పట్టేందుకని వెళ్ళాడు. ఈ క్రమంలో చెరువులో దిగేటప్పుడు ప్రమాదవశాత్తు కాలు జారీ చెరువు అంచు వద్ద పడి ఉన్నాడు. లక్ష్మీ సోదరుడు నారాయణ సమాచారం అందించగా ఏసయ్యను ఆటోలో మెదక్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు. ఆసుపత్రికి తరలించి వైద్యులచే పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి

నవతెలంగాణ-జోగిపేట



సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. బంజారా గిరిజనుల ఆరాధ్య దైవం బాల బ్రహ్మచారి సంత్ తపస్వి రామ్‌రావ్ మహారాజ్‌కు భారతరత్న ప్రకటించాలని, దేశవ్యాప్తంగా గిరిజనులను ఒక కేటగిరీలో కలపాలని, గోర్ బోలిని ఎనిమిదో షెడ్యూల్లో చేర్చాలని, హతిరం బాబాజీ ఆస్తులను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జాతీయ అధ్యక్షులు శంకర్ పవర్, మాజీ పార్లమెంట్ మెంబర్ ఉమేష్ జాదవ్, మాజీ శాసనసభ్యులు బాబురావు,లు హాజరై మాటాడారు. ఈ కార్యక్రమంలో శ్యాంనాయక్, ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు కిషన్ సింగ్, అమర్ సింగ్ పవర్, సభవత్ రాజు నాయక్ గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు జైపాల్ నాయక్, సంగారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రామ్‌చందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ బాలుర వసతిగృహంలో ఆర్డిఓ ఆకస్మిక తనిఖీలు

నవతెలంగాణ-జహీరాబాద్



స్థానిక ఎస్టీ బాలుర వసతి గృహాన్ని జహీరాబాద్ రామ్ రెడ్డి మంగళవారం ఆస్మికంగా తనిఖీ చేశారు. వసతి వసతి గృహ పరిసరాలను, వంటగదిని, సామాగ్రి గదిని, మరుగుదొడ్లను పరిశీలించారు. సామాగ్రి గదిలో విద్యార్థులకు అందజేస్తున్న భోజన సరుకుల నాణ్యతను, అన్నం, పప్పు కూరగాయలు, గుడ్లు, మజ్జిగ నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు నివసిస్తున్న ప్రతీ గదిని సందర్శించి రూమ్‌లో ఉన్న విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెల్సుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం గురించి మాట్లాడుతూ.. వైద్య పరీక్షలు నెలవారీగా జరుగుతున్నాయా లేదు తెల్సుకు న్నారు. వసతి గృహ వంట సిబ్బందితో మాట్లాడి పిల్లలకు వండే ఆహారాన్ని పూర్తి పరిశుభ్ర వాతావరణంలో వండి, వేడిగా ఉన్నప్పుడే విద్యార్థులకు అందజేయాలని ఆదేశించారు. ప్రభుత్వ నియమ నిబంధనలు ఎవరైనా ధిక్కరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



తట్టు నారాయణ తల్లిని పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-జహీరాబాద్

పార్టీ మండలాధ్యక్షులు తట్టు నారాయణ తల్లి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఏఐజి ఆసుపత్రిలో చేరింది. విషయం తెల్సుకున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆసుపత్రి చేరుకుని కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తట్టు నారాయణతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



జిన్నారం కేజీబీవీలో డీఈఓ తనిఖీలు..

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రంలో గల కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈఓ) వెంకటేశ్వర్లు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సంబంధించిన ఆహార పదార్థాలు ఇతరత్రాలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని అధ్యాపక బృందానికి, విద్యార్థులకు సూచించారు. వరల్డ్ డిజేబల్ డే పురస్కరించుకొని విద్యార్థులకు నిర్వహించిన పలు కార్యక్రమాల్లో విజేతలైన వారికి బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం స్థానికంగా మండల వనరుల కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కుమారస్వామి, పలువురు ఉపాధ్యాయులు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కవిత తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా సయ్యద్ అంజుమ్ కూతురి వివాహం

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ ప్రాంతానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ సయ్యద్ సైఫుద్దీన్ అంజుమ్ కూతురు వివాహం సోమవారం రాత్రి హైదరాబాద్లోని క్లాసిక్ గార్డెన్ లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహంలో జహీరాబాద్ శాసనసభ్యులు మాణిక్యరావు, మాజీ టీఎస్ ఐడీసీ చైర్మన్ మహమ్మద్ తన్వీర్, కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు నియోజకవర్గం ఇంచార్జి డాక్టర్ సిద్ధం ఉజ్వల్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు ముంతాజ్ ఖాన్, సంగారెడ్డి ,హైదరాబాద్ జిల్లాలతోపాటు, జహీరాబాద్ నియోజకవర్గం లోని వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు, జర్నలిస్ట్ సంఘాల నాయకులు తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.



0 పర్సంటేజి ప్లాస్టిక్ ప్రొడక్ట్స్ స్టోర్ ప్రారంభం

నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట పట్టణంలో గల 4 వార్డులో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల హైస్కూల్ ఎదురుగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర జిరాక్స్ మరియు స్టేషనరీ లో 0 పర్సంటేజి ప్లాస్టిక్ ఎక్లాస్టిక్ ప్రొడక్ట్స్ స్టోర్‌ని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సదాశివపేట పట్టణ పురపాలక సంఘం చైర్మెన్ అపర్ణ శివరాజ్ పాటిల్, వైస్ చైర్మెన్ చింతా గోపాల్, పురపాలక సంఘం కమిషనర్ ఉమా, సంగారెడ్డి జిల్లా డీఎంసీ మల్లీశ్వరి, మెప్మా అధికారులు సదాశివపేట పురపాలక సంఘం, మెప్మా విభాగం ఆర్పీలు, సమాఖ్య సభ్యులు, పురపాలక సంఘం, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా బైక్‌ర్యాలీ


నవతెలంగాణ-సదాశివపేట



కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా సదాశివపేట పట్టణంలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకుడు రాజేశ్వర్‌రావు దేశ్పాండే హాజరై మాట్లాడుతూ.. బూటకపు హామీలను ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్.. 6 గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలందరినీ మోసం చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఓదెల మాణిక్ రావు, అసెంబ్లీ కో కన్వీనర్ మల్లేశం, సంగారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్ కసిని వాసు,జిల్లా కార్యవర్గ సభ్యుడు అంబాదాస్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జిన్నారం : మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 6 గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ఇంచార్జ్ నేత అండూర్ కురుపల్ నర్సింగ్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు వంగేటి ప్రతాప్ రెడ్డి, జిన్నారం మండల అధ్యక్షులు జగన్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి వి. రాజిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు ఎం రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



గుమ్మడిదల : మండల కేంద్రంలోని టోల్ ప్లాజా నుంచి అన్నారం ప్రధాన రహదారి గుండా బైక్‌ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మాజీ మండలాధ్యక్షులు నర్సంపల్లి రాజిరెడ్డి మాట్లాడుతూ.. నాడు కేసీఆర్, నేడు రేవంత్‌రెడ్డి ఇద్దరూ తెలంగాణను దోచుకు ంటున్నారని ఆగ్ర హం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బి.రాంరెడ్డి, భాస్కర్ గౌడ్, ఉపాధ్యక్షుడు కావలి ఐలేష్, సిహెచ్ యాదగిరి, రాఘవరెడ్డి, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ హాస్టళ్ల పునరుద్ధరణకు చర్యలు

- స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేనారెడ్డి
- పాడిపంటల్లాగానే ప్రభుత్వ పథకాలు ఇంటింటికి వస్తున్నాయి
- టీజీఐఐసి చైర్మెన్ నిర్మలా జగ్గారెడ్డి.
- ఇందిరా మహిళా శక్తి పథకం కింద 8 గ్రూపులకు రెండు కోట్లు
- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

నవతెలంగాణ-సంగారెడ్డి



స్పోర్ట్స్ హాస్టళ్ల పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నట్టు స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేనారెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి అంబేద్కర్ స్పోర్ట్స్ గ్రౌండ్‌లో మంగళవారం అర్బన్ డే కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేనారెడ్డి, టి జి ఐ సి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ శివసేనారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల అమలుకు ప్రజల సహకారంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తున్నదన్నారు. నిరుద్యోగులకు 50 వేల పైచిలుకు ఉద్యోగాలు ఇచ్చిన ఘనత భారత దేశంలో ఈ రాష్ట్రానికి తప్ప ఎక్కడా లేదన్నారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్టు చెప్పారు. రూ.4000 పింఛన్లను కూడా అతి త్వరలోనే అమలు చేస్తారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏడు లక్షల కోట్ల అప్పులు చేశారని.. ఈ అప్పులపై ఏడాదికి రూ.60 వేల కోట్ల మిత్తి కడుతున్నట్టు చెప్పారు. అవే మిగిలి ఉంటే ఈవేళ మహిళలకు రూ.2500 పథకం, రూ.4000 పింఛన్ ఎప్పుడో అమలు అయ్యేదని గుర్తు చేశారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు కిస్తీ రూపంలో రేవంత్ రెడ్డి సర్కారు చెల్లిస్తున్నదన్నారు. వచ్చేయడాదిలో 7500 రుణమాఫీ చేయబోతున్నామన్నారు. పేద విద్యార్థులకు ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూలను రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేయబోతోందన్నారు. త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్నామని.. స్పోర్ట్స్ స్కూళ్లను, స్పోర్ట్స్ అకాడమీలను పెంచుతున్నామన్నారు.స్పోర్ట్స్ హాస్టల్లో కూడా పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నామన్నారు. టీజీఐఐసి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. పాడిపంటల్లాగానే ప్రభుత్వ పథకాలు ఇంటింటికి వస్తున్నందున ప్రతీ ఇంటా ప్రజాపాలన విజయోత్సవాలు ఒక పండుగలా జరపాల న్నారు. మహిళా సంఘాలకు తోడ్పాడునందించే విధంగా ప్రభుత్వం పథకాలను రూపొందించిందన్నారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ.. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పం రాష్ట్ర ప్రభుత్వాని దన్నారు. అందుకు అనుగుణంగా మహిళలు సొంతంగా వ్యాపార యూనిట్స్‌లను నెలకొల్పి అభివృద్ధి చెందాలన్నారు. మహిళలు ముందుకు వచ్చి ఇందిరా మహిళా శక్తి పథకం కింద యూనిట్స్ నెలకొల్పి ఉపాధి పొందాలన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా శక్తి గ్రూపులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పట్టణం అభివృద్ధి చెందాలంటే ప్రజలందరూ తోడ్పాటున అందించాలన్నారు.పట్టణ పట్టణాన్ని శుభ్రంగా ఉంచే విధంగా సహకరించాలని పట్టణంలో పచ్చదనం అభివృద్ధి పరచడంలో ప్రజలు తోడ్పాటు అందించాలన్నారు. అనంతరం ఇందిరా మహిళా శక్తి పథకం కింద 8 గ్రూపులకు రెండు కోట్ల పాయలను , 24 మంది వీధి వ్యాపారులకు ఐదు లక్షల రూపాయల చెక్కులను అంది ంచా రు. ప్రజా పాలన విజయోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్మికులను సన్మానించారు. మహిళా శక్తి సభ్యులు ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్ ను తిలకించారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ మనోజ్, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, వార్డ్ కౌన్సిలర్లు, మహిళా శక్తి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



హెడ్ కానిస్టేబుల్‌కు ఘన వీడ్కోలు

నవతెలంగాణ-వట్‌పల్లి

వట్‌పల్లి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొంది హైదరాబాదుకు బదిలీపై వెళ్తున్న పండితుకు ఎస్ఐ అధ్యక్షతన మంగళవారం ఘనంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి పూలు, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ పండిత్ మాట్లాడుతూ.. ఈ స్టేషన్‌లో గత ఆరున్నర ఏండ్లుగా విధులు నిర్వహించి.. ఫ్రెండ్ పోలీస్ విధానాన్ని స్నేహపూర్వకంగా నిర్వర్తించి పోలీసు వ్యవస్థకు మంచి గుర్తింపు తేవడం జరిగిందన్నారు. ఎస్సై పెట్టల్ మాట్లాడుతూ.. ఉద్యోగ వృత్తిలో బదిలీలు సహజమేనన్నారు. ఎక్కడ విధులు నిర్వహించినా బాధ్యతయుతంగా పనిచేసినప్పుడే ప్రజలకు న్యాయం చేసినట్టు అవుతుందన్నారు. విధి నిర్వహణలో ఒత్తిడిని అధిగమించి అందర్నీ సమన్వయం పరుచుకుంటూ విధి నిర్వాహణలో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మేదర్ చంద్రశేఖర్, రైటర్ ప్రతాప్, కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ప్రజా పాలన విజయోత్సవాల్లో పరికరాల పంపిణీ

నవతెలంగాణ-పటాన్‌చెరు



వికలాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం, ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా పట్టణంలోని జీహెచ్‌ఎంసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పటాన్‌చెరు సర్కిల్ పరిధిలోని 3 డివిజన్లకు సంబంధించిన 225 మంది వికలాంగులకు రూ.17 లక్షల 97 వేలతో కొనుగోలు చేసిన వినికిడి యంత్రాలు, వీల్ చైర్లు, చేతి కర్రలు, ట్రై సైకిళ్లను స్థాక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శారీరక లోపాలను అధిగమించి నేడు వికలాంగులు సైతం అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారన్నారు.ఆత్మవిశ్వాసానికి ప్రతీక వికలాంగులన్నారు. నియోజకవర్గంలోని దివ్యాంగుల సంక్షే మానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామన్నారు. గతంలో 400 మంది వికలాంగులకు నాలుగు కోట్ల రూపా యల సొంత నిధులతో ద్విచక్ర వాహనాలను అందించామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మెట్టు కుమార్‌యాదవ్, సింధు ఆదర్శ్ రెడ్డి, పుష్ప నగేష్, జీహెచ్‌ఎంసి డిప్యూటీ కమి షనర్ సురేష్, సిఐ వినాయకొరెడ్డి,అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-కల్హేర్



మండలంలోని అల్లిఖాన్‌పల్లి గ్రామానికి చెందిన విశ్లావత్ నింబే నాయక్, విస్లావత్ బద్దే నాయక్ ఇటీవలే మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి మృతుల ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులు సర్యా నాయక్, గణపతి, శోభన్, భవిత, కవిత, లలితలను మంగళవారం పరామర్శించి మనోధైర్యాన్ని అందించారు. అదే మండలంలోని మీర్ఖాన్‌పేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శివరాంపల్లి గంగారాం పంతులు ఇటీవల హఠాత్తుగా మరణించగా.. వారి ఇంటికి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అదే మండలంలోని కృష్ణపూర్ గ్రామానికి చెందిన పెద్దాడే బాలయ్య భార్య లచ్చవ్వ ఇటీవల మృతి చెందగా.. ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన తోపాటు మండల తాజా మాజీ జెడ్పీటీసీ నరసింహారెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు రాంసింగ్, మాజీ సర్పంచ్ రవి, మాజీ సర్పంచ్లు శ్యామ్,రవి, నాయకులు నారాయణ,కుర్మా సాయిలు,లక్ష్మయ్య, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

మలిదశ ఉద్యమానికి ఊపిరిలూదిన శ్రీకాంతా చారి

నవతెలంగాణ-పటాన్‌చెరు



మలిదశ తెలంగాణ ఉద్యమానికి తన ఆత్మబలిదానంతో ఊపిరిలూది.. ఉద్యమం ఎగిసేలా చేసిన మహనీయుడు శ్రీకాంతాచారి అని మెదక్ పార్లమెంట్ కంటెస్టెంట్ కాంగ్రెస్ పార్టీ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. శ్రీకాంత్ చారి వర్ధంతిని పురస్కరించుకొని చిట్కుల్లోని ఎన్ఎంఆర్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం శ్రీకాంత్ చారి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం సాగుతున్న సమయంలో ఉద్యమాన్ని అణచడానికి అప్పటి సమైక్యాంధ్ర పాలకులు పన్నాగాలు చేస్తున్న తరుణంలో తన ఆత్మబలిదానంతో ఉద్యమం నిలబడాలనిపెట్రోల్ పోసు కొని నిప్పంటించుకుని జై తెలంగాణ నినాదాలతో ఉద్యమకారుల్లో స్ఫూర్తినింపారని కొనియా డారు. ఆనాడు ఆ మహనీయుడు ఆత్మబలిదానంతో తెలంగాణ సమాజమంతా ఉవ్వెత్తున ముందుకు కదలి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఉద్యమాన్ని ఉధృతం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఉద్యమకారుల కుటుంబాలను నేటి కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి గౌరవిస్తున్నదన్నారు.

కుల దురహంకార హత్యా నిందితుడిని కఠినంగా శిక్షించాలి





నవతెలంగాణ-సంగారెడ్డి, నారాయణఖేడ్‌రూరల్



కులాంతర వివాహం చేసుకున్నదని అగ్రకుల దురహంకారంతో కానిస్టేబుల్ నాగమణిని తన సోదరుడు పరమేష్ హత్య చేయడం శోచనీయమని.. పరమేష్‌ను తక్షణమే పోలీసులు అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు అతి మెల మాణిక్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అశోక్, జిల్లా కమి టీ సభ్యులు చంద్రశేఖర్‌లు వేర్వేరు సందర్భాల్లో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓ ప్రకటనలో మాణిక్, సంగారెడ్డి సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సమావే శంలో అశోక్, నారాయణఖేడ్‌లో చంద్రశేఖర్‌లు మాట్లాడ తూ.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోలు గ్రామానికి చెందిన కొంగరి నాగమణి అనే కానిస్టేబుల్ నవంబర్ 10న శ్రీకాంత్ అనే దళిత యువకుడిని కులాంతర వివాహం చేసుకున్నదన్నారు. అయితే నాగమణి తల్లిదం డ్రులు కొన్నేండ్ల క్రితమే మృతి చెందారు. కాగా ఆ కుటుంబా నికి కొంత ఆస్తి ఉండగా.. తక్కువ కులం వాడిని పెళ్లి చేసుకోవడమే కాకుండా ఆస్తిలో వాటా తీసుకు ంటున్నదనే కోపంతో నాగమణి తమ్ముడు ఈ ఘాతుకానికి పాల్పడ్డాడన్నారు. కులాంతర వివా హాలు చేసుకున్న వారికి ప్రోత్సహం లేక పోవడం వారికీ రక్షణ లేకపోవడంతో ఇలాంటి కులదు రహంకార హత్యలు బహిరంగంగా జరుగుతు న్నాయన్నారు. నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు హత్యా నేరం కింద కేసులు పెట్టి కఠినంగా శిక్షించాలన్నారు. నాగమణి భర్త శ్రీకాంత్ కుటుంబానికి ప్రభుత్వం రక్షణ కల్పిస్తూ శ్రీకాంత్‌కు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. దుండగులను కఠినంగా శిక్షించాల ని మళ్ళీ ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కారక్రమాల్లో సంగారెడ్డిలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు న్యాయవాది కే. సుభాష్, జిల్లా కమిటీ సభ్యులుదత్తు, ఖేడ్‌లో మండల నాయ కులు భాస్కర్, శ్రీకాంత్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాల ఓన్‌ప్లేట్ వాహనాలకు అనుమతివ్వొద్దు



నవతెలంగాణ-కంది

ఇతర రాష్ట్రాలకు చెందిన ఓన్‌ప్లేట్ వాహనాలు సంగారెడ్డి జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని.. అలాంటి వాహనాలకు ఇక్కడ అనుమతి ఇవ్వొద్దని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్టీఏ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన చేపట్టారు. అనంతరం ఆర్టీఏ అరుణకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎండి మహబూబ్ ఖాన్ మాట్లాడుతూ.. ఏ విధమైన ఉపాధి లేక అప్పులు చేసి లైట్ మోటార్ వెహికల్, ట్రావెలర్స్ వాహనాలు నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్న స్థానిక డ్రైవర్ల పొట్ట కొడుతూ.. ఇతర రాష్ట్రాలకు చెందిన ఓన్‌ప్లేట్ వాహనాలు ఇష్టారీతినా తిరుగుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని మండపడ్డారు. రాజకీయ నాయకుల అండదండలతో మామూళ్లకు కక్కుర్తి పడి స్థానిక డ్రైవర్ల పొట్టగొడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే అన్ లైన్ ట్యాక్సీలు, ఓలా ఉబర్ వచ్చి స్థానిక డ్రైవర్లకు ఉపాధి లేక ఇబ్బందులకు గురవుతుంటే మరోపక్క రాష్ట్రాల వాహనాలు తిరగడంతో ఉపాధి లేక డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికే పలుమార్లు ఆర్టీఏ అధికారులకు తమ గోడును వెళ్లబోసుకున్నా.. పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సెలవు దినాల్లో రాత్రి సమయాల్లో స్కూల్, కాలేజ్ బస్సులు అద్దెకిస్తున్నారని వాపోయారు. వెంటనే ఇతర రాష్ట్రాల ఓన్‌ప్లేట్ వాహనాలను తెలంగాణ రాష్ట్రంలో తిరగకుండా.. స్కూల్ కాలేజీ బస్సులను శుభకార్యాలకు వాడకుండా ఆర్టీఏ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల జిల్లా వ్యాప్తంగా డ్రైవర్లను సమీకరించి జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్ యూనియన్ నాయకులు ముక్రమ్, ఆశిరెడ్డి ,బాబన్న, అశోక్ ఖదీర్ పటేల్ దాస్ వెంకట్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ

నవతెలంగాణ-వట్‌పల్లి



అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వికలాంగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సుభాష్, మండల అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రైమరీ పాఠశాలలో, అంగన్వాడి కేంద్రాల్లో విద్యార్థులకు అరటి పండ్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శశిప్రభ, డిప్యూటీ తహసీల్దార్ షంటిరెడ్డి, ఎస్‌హెచ్‌ఓ విట్టల్, వైస్ ప్రెసిడెంట్ ఖలీల్ మియా, ప్రధాన కార్యదర్శి కుమార్, ధన్సింగ్ రాజు, జయరాం, శ్రీను, వీరమని తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ, పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు తక్షణమే చెల్లించాలి









నవతెలంగాణ-జోగిపేట,సదాశివపేట,మునిపల్లి, జహీరాబాద్

ఆశా వర్కర్స్ సమస్యలను తక్షణ పరిష్కరించాలని.. లెప్రసీ పల్స్ పోలియో సర్వే చేసిన పెండింగ్ డబ్బులను తక్షణమే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా జిల్లా కార్యదర్శి జి.సాయిలు, ఉపాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్‌లు వేర్వేరు ఘటనల్లో డిమాండ్ చేశారు. అందోల్ మండలంలోని తాలెల్మా పీహెచ్‌సీ ఎదుట సాయిలు ఆధ్వర్యంలో, సదాశివపేటలోని పీహెచ్‌సీ ఎదుట అలాగే మునిపల్లి పీహెచ్‌సీ ఎదుట ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించి.. సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. జహీరాబాద్‌లోని స్థానిక క్లస్టర్ కార్యాలయం ఎదుట మహిపాల్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ క్రమంలో సీహెచ్‌ఓ రవి, ఇతర అధికారులతో వాగ్వాదం జరిగింది. అనంతరం సీహెచ్‌ఓకు వినతి పత్రం అందజేశారు. ఆయా సందర్భాల్లో వారు మాట్లాడుతూ.. 20 ఏండ్ల నుంచి ఆశా వర్కర్స్ పనిచేస్తున్న వారికి ఫిక్స్‌డ్ వేతనం అమలు కావడం లేదన్నారు. గతంలో లెప్రసీ సర్వే, పల్స్‌పోలియో ఇతర అనేక రకాల సర్వేలు చేసినా.. వాటికి డబ్బులు చెల్లించడం లేదన్నారు. చేసిన వాటికి డబ్బులు ఇవ్వకుండా మళ్ళీ సర్వేలు చేయాలని ఒత్తిడి చేయడం దుర్మార్గమన్నారు. గతంలో సర్వే చేసిన వాటికి డబ్బులు తక్షణమే ఇవ్వాలని ఆ తర్వాతనే మిగతా సర్వేలు చేస్తామని హెచ్చరించారు. ఆశా వర్కర్స్‌కు ఫిక్స్‌డ్ వేతనం రూ.18,000 ఇస్తానని హామీ ఇచ్చినా.. ఇంతవరకు అమలు జరపడం లేదన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకు పోవడంలో ఆశా వర్కర్స్ చాలా కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆశా వర్కర్లకు ఈఎస్ఐ, పీఎఫ్ చట్టపరమైన సౌకర్యాలు కల్పించా లన్నారు. వారిని ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించాలని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో అందోల్ డివిజన్ కార్యదర్శి డి. విద్యాసాగర్, ఆశా వర్కర్లు యశోద, లక్ష్మి, గంగమణి, భాగ్య, సంతోష, సదాశివపేటలో ఆశా వర్కర్ నాయకులు లావణ్య, స్వప్న, లక్ష్మి సాయి, శిరీష, సరిత, అనిత, పుష్పలత, కృష్ణవేణి, హేమలత, స్రవంతి, మునిపల్లిలో సీఐటీయూ మండల నాయకులు రమేష్ గౌడ్, ఆశా వర్కర్ నాయకులు సంగీత, మంజుల సావిత్రి, పద్మ, సునీత, జహీరాబాద్‌లో తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జహీరా బాద్ క్లస్టర్ అధ్యక్ష కార్యదర్శి శశికళ, శశిరేఖ ఉపాధ్యక్షులు నందమ్మ,నాయకులు లక్ష్మి,శ్యామల,నిర్మల తదితరులు పాల్గొన్నారు

నారాయణఖేడ్ రూరల్ : నాగలిగిద్ద మండల పరిధిలోని కరసగుత్తి ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆశా వర్కర్లు నిరసన చేపట్టారు. అనంతరం మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల యూనియన్, సీఐటీయూ నాయకురాలు శాంతాబాయి మాట్లాడుతూ...



గత రెండేండ్ల నుంచి లెప్రసీ, పల్స్ పోలియో డబ్బులు చెల్లించకుండా ప్రభుత్వం మళ్ళీ సర్వేలు చేయాలని ఒత్తిడి చేస్తోందన్నారు. బకాయి డబ్బులు చెల్లిస్తేనే కొత్త సర్వేలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కవిత, సుజాత, జగదేవి, రుక్మిణి, శివలీల, మలన్బి తదితరులున్నారు.

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని నస్కల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించామని మండల విద్యాధికారి సాంగని యాదగిరి, జెడ్పీ హెచ్ఎం సత్యం రెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సాగరికలు తెలిపారు. వైకల్యం అనేది మనం చూసే దృష్టిలో ప్రవర్తించే తీరులో ఉంటుందన్నారు. అంగవైకల్యం చూసే విధానంలో ఉంటుందని సిడబ్ల్యు ఎస్ ఎన్ పిల్లలను ప్రోత్సహించి వారిని అన్ని రంగాలలో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతి ఒక్కరిలో స్కిల్ ఉంటుందని, ఆ ప్రతిభను వెతికి తీయాలన్నారు. జకియ మాట్లాడుతూ ఎందులో అయినా గెలవాలని తపన పట్టుదల, నమ్మకం ఉంటే తప్పకుండా గెలుస్తామని అంగవైకల్యం అడ్డు కాదన్నారు. ఐఇఆర్పి రాజయ్య మాట్లాడుతూ 21 రకాల అంగవైకల్యాలను గుర్తించడం జరిగిందన్నారు. ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ఎంఈఓ అందజేశారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యు ఎస్ ఎన్ పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

మెదక్

3

బుధవారం | 04 డిసెంబర్ 2024 | www.navatelangana.com

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆటల పోటీలు



నవతెలంగాణ-వెల్దుర్తి

ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని శ్రీ రాయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు ఆధ్వర్యం లో క్రీడలను నిర్వహించారు. ఈ సంద ర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాసులు మాట్లాడా రు. ఆటలాడటం వల్ల శరీరం దృఢంగా ఉంటుందని, మానసికోల్లాసం కలుగుతుందని ఆటలలో గెలుపోటములు సహజమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్యామ్, స్వామి, నాందేవ్, రసజ్ఞ. నాన్ టీచింగ్ సిబ్బంది అక్బర్, సంజీవరావు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనంపై నుంచి పడి వ్యక్తికి గాయాలు



నవతెలంగాణ-నిజాంపేట

టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడి ఓ వ్యక్తికి గాయా లయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా భూంపల్లి మండల పరిధిలోని పోత రెడ్డి పేట గ్రామానికి చెందిన వ్యక్తి రామాయంపేట నుంచి టీవీఎస్ ఎక్సెల్‌పై పోత రెడ్డి పేట గ్రామానికి వెళుండగా మార్గమధ్యంలో నిజాంపేట మండల కేంద్రంలో టీవీఎస్ ఎక్సెల్ అదుపుతప్పి కింద పడిపోయి తలకు గాయాల య్యాయి. ఆటోలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు,

6న జిల్లా గౌడ జనహక్కుల పోరాటసమితి సమావేశం

- గౌడ సంఘం మాజీ మండలాధ్యక్షుడు నరేందర్ గౌడ్



నవతెలంగాణ-పాపన్నపేట

కౌడిపల్లి మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద ఈనెల 6న గౌడ జన హక్కుల పోరాట సమితి మెదక్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించ నున్నారని పాపన్నపేట గౌడ సంఘం మాజీ మండలాధ్యక్షుడు నరేందర్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమావేశంలో గౌడ కులస్తుల సమస్యల పరిష్కారం కోసం చర్చించనున్నారని, సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు విజయ్ కుమార్ గౌడ్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్నారని తెలిపారు. గౌడ సంఘం పెద్దలు, సభ్యులు ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అంకితభావంతో పనిచేసేవారికి ఎప్పుడు గుర్తింపు

- ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన నర్సింలు
- కొనియాడిన ఎంఈఓ కృష్ణ



నవతెలంగాణ-పాపన్నపేట

విధినిర్వహణలో అంకిత భావంతో పనిచేసేవారికి ఎప్పుడు గుర్తింపు ఉంటుందని, ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన టీచర్ తీగల నర్సింలు సేవలు అభినందనీయమని ఆందోల్ ఎంఈఓ కృష్ణ, టేక్మాల్ మండల మాజీ ఎంఈఓ లు పాతూరి శంకర్, టి.నర్సింలులు కొనియాడారు. పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఏడుపాయల శ్రీనివాస నిలయంలో పాపన్నపేట మండల యూసఫ్ పేట గ్రామానికిచెందిన ఉపాధ్యాయులు తీగల నర్సింలు ఉద్యోగ విరమణ అభినందన సభ జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా ఆందోల్ ఎంఈఓ కృష్ణ, టేక్మాల్ మండల మాజీ ఎంఈఓ లు పాతూరి శంకర్, టి నర్సింలు, మెదక్ జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షులు సుంకరి క్రిష్ణ, మాజీ అధ్యక్షులు టి రాందాస్, సత్యనారాయణ రెడ్డి, మండల పీఆర్ టీయూ అధ్యక్షుడు ఎండి అమీరొద్దీన్, సీనియర్ రాష్ట్ర నాయకులు ఆకులపల్లి దుర్గయ్య, శంకర్ రావు, తదితరులు ప్రసంగించారు. ఉపాధ్యాయులు నర్సింలు టేక్మాల్ మండలంలో సుదీర్ఘంగా, కంగ్టి, వట్ పల్లి మండలాల్లో విధులు నిర్వహించి పలువురి మన్ననలు పొందారని గుర్తుచేశారు. ఉద్యోగులకు పదవీవిరమణ సహజమన్నారు. నిబద్ధత, నిజాయితీకి టీచర్ నర్సింలు నిదర్శనమన్నారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు నర్సింలును పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు సుంకరి కృష్ణ, ఆకులపల్లి దుర్గయ్య, జిల్లా మాజీ అధ్యక్షులు టి రాందాస్,సత్యనారాయణ రెడ్డి, మాజీ ఎంఈఓ లు పాతూరి శంకర్, టి నర్సింలు, టేక్మాల్ పీఆర్ టియూ మండల శాఖ అధ్యక్షులు అమీరొద్దీన్, ప్రధాన కార్యదర్శి సహదేవ్, జిల్లా పీఆర్ టియూ రాష్ట్ర నాయకులు ఆకులపల్లి దుర్గయ్య, శంకర్ రావు, బాల్య, మల్లారెడ్డి, కె సంగమేశ్వర్, నాయకం శ్రీకాంత్, వంశీకృష్ణ,పంతులు రాజు, దాసరి సురేష్, పోచయ్య, అశోక్ రెడ్డి, దేవదానం, అబ్రాహాము,కొత్త మల్లయ్య, కొత్త వెంకటేశం, ఇమ్మడి సంతోష్ కుమార్,టేక్మాల్ పీఆర్ టీయూ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పూలమాలలువేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భండాగారాలు



నవతెలంగాణ-మనోహరాబాద్

గ్రంథాలయాలు విజ్ఞాన భండాగారాలని చిన్న నాటి నుండే మంచి పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని నాయకులు భాస్కర్‌యాదవ్ సూచించారు. మనోహరాబాద్ మండల కేంద్రంలోని గ్రంథాలయ అభివృద్ధి కోసం నిధులను కేటాయించి కిటికీలు, గ్రిల్స్, పుస్తకాలు, ప్యాడ్స్, కుర్చీలను అందజేశారు. దాంతో గ్రంథాలయ సభ్యులు భాస్కర్‌యాదవ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయం విజ్ఞానాన్ని పెంచే మంచి పుస్తకం లాంటిదన్నారు. మంచి మంచి పుస్తకాలు అందుబాటులో ఉంటాయని చిన్ననాటి నుంచే పుస్తకాలు చదివే అలవాటును చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయంలో సంఘ సంస్కర్తలు, మహనీయుల జీవిత చరిత్రలకు సంబంధించిన మంచి పుస్తకాలు ఉంటాయని అలాంటి పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. అలాగే పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి కూడా ఇలాంటి గ్రంథాలయాలు చాలా అవసరమన్నారు. ప్రతి ఒక్కరు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ సభ్యులు అలాగే పీఈటి గోవర్ధన్, కానిస్టేబుల్ సురేష్, గ్రామ యువకులు అజయ్‌కుమార్, కోనేరు సురేష్, గణేష్‌గౌడ్, భిక్షపతి, చిన్న యాదవ్, సతీష్‌యాదవ్‌తో పాటు సాఫ్టబాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి



- అదనపు కలెక్టర్ నగేష్
- మెదక్‌లో ఘనంగా 2కె రన్

నవతెలంగాణ-మెదక్

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా టూ కే రన్ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఏర్పడి సంవత్సర సంవత్సరకాలం పూర్తి అయిన సందర్భంబగా నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా మెదక్ ప్రభుత్వం బాలుర కళాశాల క్రీడా ప్రాంగణం నుంచి పురవీధుల గుండా టూ కే రన్ నిర్వహించారు. ప్రజా పాలన విజయోత్సవాలు జిల్లాలో సమర్థవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 7, 8 తేదీలలో గ్రామస్థాయిలో 10 నుంచి 12వ తేది వరకు మండల స్థాయిలో 16 నుంచి 21 వరకు జిల్లా స్థాయిలో ఆయా కమిటీల ఆధ్వర్యంలో వివిధ క్రీడా అంశాలలో సీఎం కప్పు పోటీలు నిర్వహిం చనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మున్సిపల్ చైర్మెన్ చంద్రపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్య రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. నిర్వహణ అధికారి దామోదర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి జమల నాయక్, వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశాలకు ఫిక్స్ వేతనం చెల్లించాలి



నవతెలంగాణ-చిన్నశంకంపేట.

ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేలు ఫిక్స్ వేతనాన్ని చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ఆశా వర్కర్స్ చేస్తున్న ధర్నాలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాలకు ఫిక్స్ వేతనంగా నెలకి రూ.18000లు చెల్లించాలని, లెప్రసి,సర్వే చేసిన డబ్బులు వెంటనే చెల్లించాలని, ప్రతి ఆదివారం ఆశాలకు సెలవులు ఇవ్వాలని, ప్రసూతి సెలవులు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఆశాలతో అనేక పనులు చేయించుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం వారి సమస్యల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఫిక్స్ వేతనం ఇస్తామని ప్రభుత్వం హామీ వచ్చిందని తెలిపారు. అధికారం చేపట్టి సంవత్సరం పూర్తి చేసుకుని ఉత్సవాలు చేసుకుంటున్నారు కానీ ఆశలను పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. ఆశలతో పని చేయించుకోవడంలో ఉన్న శ్రద్ధ, ఆశాల సమస్యల పరిష్కారంలో లేదన్నారు. ఇప్పటికైనా ఇప్పటికైనా ప్రభుత్వం ఆశాల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. లేనిచో రాబోవు అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పోరాటాన్ని ఉధృతం చేపడతామని హెచ్చరించారు. ధర్నా అనంతరం కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు దేవమ్మ, పి.ఎచ్.సి నాయకులు నాగమణి, ఊర్మిళ, కవిత,బుజ్జి,లలిత,సంతోష తదితరులు పాల్గొన్నారు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- ఎమ్మెల్యే సునీత రెడ్డి



నవతెలంగాణ-నర్సాపూర్

మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే సునీత రెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా నర్సాపూర్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో అర్బన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సునీత రెడ్డి హాజరై మహిళలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను వృథా చేయకుండా చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే కుటుంబం అభివృద్ధి చెందుతుందన్నారు. నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పారిశుధ్యం విషయంలో మున్సిపల్ కార్మికుల సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దుర్గాప్ప గారి అశోక్ గౌడ్, ఆర్డీవో మైపాల్ రెడ్డి, కమిషనర్ రామకృష్ణ రావు, వైస్ చైర్మన్ నయీముద్దీన్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ సృజన, పిడి ఇంద్ర ,స్థానిక తాసిల్దార్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు పంపల్ల రామచందర్, నాయకులు బిక్షపతి , ఆంజనేయులు గౌడ్, బాల్రెడ్డి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

భూమి కోల్పోతున్న రైతులతో సమావేశం



- జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి

నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

జిల్లాలో రీజనల్ రింగ్ రోడ్డు వలన భూమి కోల్పోతున్న ఆయా గ్రామాల రైతులతో మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతులు.. భూమే ఆధారంగా వ్యవసాయమే బతుకుదెరువుగా జీవనం సాగిస్తున్నామన్నారు. ఆ భూమిని రిజనల్ రింగ్ రోడ్డుకు తీసుకోవడం అత్యంత బాధకరం. అయిన ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఇవ్వడానికి సుముఖంగానే ఉన్నా నష్ట పరిహారం విషయంలో ప్రత్యేక చొరవ చూపించి బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరకు సరిపోను తగినంత మొత్తంలో నష్టపరిహారం లేదా ల్యాండ్ పూలింగ్ లో అదే రోడ్డు వెంబడి కొంత స్థలం ఇప్పించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రీజనల్ రింగ్ రోడ్డుకు ఈ ప్రాంత అభివృద్ధి కోసం భూమిని ఇవ్వడానికి రైతులు ఒప్పుకోవడం శుభపరిణామం అన్నారు. ఆయా గ్రామాల్లో భూమి విలువను మీరు తెలిపిన వాటిని పూర్తిగా నోట్ చేసుకుని దీనిని రాష్ట్ర స్థాయి అధికారులకు పంపించి అందరికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ల్యాండ్ పూలింగ్ గుర్చి కూడా అధికారులతో చర్చిస్తానని తెలిపారు.

సీఎం సహాయ నిధిని పెంచండి



- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్

ముఖ్యమంత్రి సహాయ నిధిని పెంచాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ ఇంచార్జి ప్రతాప్ రెడ్డి అన్నారు. మండలం లోని వివిధ గ్రామాలకు చెందిన బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం వారు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో రూ.లక్ష సహాయ నిధికి 50శాతం వరకు అందిస్తే, ఇప్పుడు రూ.10వేల కూడా అందిస్తలేరన్నారు. కాబట్టి సీఎంఆర్ఎఫ్ నిధిని పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్, ఆత్మ కమిటీ మాజీ చైర్మెన్ యాడెం కృష్ణారెడ్డి, కౌన్సిల్ సభ్యులు శ్యామల మల్లేష్ యాదవ్, పాల్గొన్నారు.

లెప్రసి, పల్స్ పోలియో పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించండి

నవతెలంగాణ-దుబ్బాక



గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న లెప్రసి, పల్స్ పోలియో డబ్బుల్ని వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో పలువురు ఆశా వర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం దుబ్బాక మండల పరిధిలోని తిమ్మాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ ముధస్తర్‌కి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు సీహెచ్.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ డిసెంబర్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో లెప్రసి సర్వే చేయాలని ఆశాలకు జిల్లా అధికారులు చెప్తున్నారని, వెంటనే లెప్రసీ సర్వే కోసం ట్రైనింగ్ కూడా ప్రారంభించారని తెలిపారు. ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆపాలని, లెప్రసి,పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు చెల్లించిన తర్వాతనే కొత్త సర్వేలు చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 2023లో సగం జిల్లాలకు, 2024లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు ఆశాలు చేసిన లెప్రసి సర్వే డబ్బులు, 2024లో చేసిన పల్స్ పోలియో డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం నేటికీ ఆశాలకు చెల్లించలేదని ఆరోపించారు. ఇదే విషయమై కమిషనర్ ఆఫీస్‌లో సంబంధిత అధికారులను ఆశా యూనియన్ ఆధ్వర్యంలో కలిసినప్పుడు రెండేళ్ల లెప్రసి సర్వే డబ్బులు రిలీజ్ చేసి చాలా కాలమైందని, సర్వేకు ముందే ఈ బడ్జెట్ రిలీజ్ చేయడం జరిగిందని చెప్పారని గుర్తు చేశారు. బడ్జెట్ వివరాలతో కూడిన సంబంధిత ప్రొసీడింగ్ ఆర్డర్స్ అందజేశారని, ఈ ఆర్డర్ కాపీలు తీసుకొని అన్ని జిల్లాల్లో తమ నాయకత్వం జిల్లా డీఎంహెచ్‌ఓలను కలిసి పెండింగ్ లెప్రసి సర్వే డబ్బులు చెల్లించాలని కోరడం జరిగిందన్నారు. తమకు ఎలాంటి డబ్బులు రాలేదని, ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇచ్చినంత మాత్రాన డబ్బులు ఇచ్చినట్టు కాదని జిల్లా అధికారులు అంటున్నారని, ఈ అంశాన్ని రాష్ట్రస్థాయిలో సంబంధిత అధికారులకు తెలియజేసినా తమది కాదంటే తమది తప్పు కాదని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరిరువురి మధ్య రాష్ట్ర వ్యాప్తంగా ఆశాలు గందరగోళానికి గురవుతున్నారని విమర్శించారు. పైగా రెండేళ్ల నుంచి చేసిన లెప్రసి సర్వే ,2024లో చేసిన పల్స్ పోలియో డబ్బులు రాక ఆశాలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి చేసిన పనికి డబ్బులు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తూ, ఇప్పుడు మళ్లీ కొత్తగా లెప్రసి సర్వే చేయాలని ఒత్తిడి చేయడం ఎంతవరకు సమంజసమని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పై అంశాలు పరిశీలించి, వెంటనే పరిష్కారం కోసం కృషి చేయాలని, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లు శారద, మణెమ్మ, స్వరూప, చంద్రకళ, సంతోష, రేణుక, అనిత, విజయ, నాగరాణి, శ్యామల, తదితరులున్నారు.

నిరుపేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

నవతెలంగాణ-బెజ్జంకి



మండల పరిధిలోని రేగుల పల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం మల్లం చెరువులోని నిరుపేదలకు గామా ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో నిత్యావసర సరుకులు మంగళవారం పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధి మాతంగి జితేందర్,శ్రీనివాస్, మల్లేశం,రాజయ్య పాల్గొన్నారు.

నర్సింగ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-మద్దూరు

మండల కేంద్రంలోని కేజీబీవీ జూనియర్ కళాశాలలో రెండు నర్సింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అందుకు అతిధి అధ్యాపకురాలిగా పనిచేసేందుకు అర్హత ఉన్న మహిళ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కస్తూర్బా గాంధీ పాఠశాల ఎస్ఓ స్వప్న మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి 2024-25 విధులు నిర్వర్తించడానికి అభ్యర్థులు మూడు రోజులలోపు కేజీబీవీ మద్దూరులో దరఖాస్తులు సమర్పించాలి అని ఆమె తెలిపారు. స్థానికంగా ఉండి ఎంఎస్సీ నర్సింగ్ లేదా బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసిన వారు అర్హులని పేర్కొన్నారు. నెలసరి వేతనము రూ.23 వేలు ప్రభుత్వం చెల్లిస్తుందని. ఈ విద్యా సంవత్సరం వరకు మాత్రమే పనిచేయాల్సి ఉంటుందని ఆమె తెలిపారు. ఈనెల 7 లోపు దరఖాస్తు చేసుకోవాలని. మెరిట్, డెమో ప్రకారం ఎంపిక చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు.

వికలాంగుల పట్ల సేవాభావంతో మెలగాలి

నవతెలంగాణ-జగదేవపూర్



వికలాంగుల సేవ విశ్వమానవ సేవగా భావించాలని మండల విద్యాధికారి మాధవ రెడ్డి అన్నారు. బుధవారం మండల వనరుల కేంద్రం ఆవరణలో నిర్వహించిన ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. వైకల్యమున్న వారిని ఆదరించి వారి హక్కులను గౌరవించాలని ఈ విషయాల్లో సమాజం చైతన్యం కావల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం అందుకే సమ్మిళితం విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటోందని ఆయన తెలిపారు. విద్యార్థులతో వారు సహపంక్తి భోజనం చేశారు. అనంతరం విజేతలైన వారందరికీ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సైదులు , ఉపాధ్యాయినులు విజయలక్ష్మి, సునీత, రేఖ, రీసోర్స్ పర్సన్స్ బాలయ్య, కరుణాకర్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సిరి ఆసుపత్రిలో అరుదైన చికిత్స

నవతెలంగాణ-సిద్దిపేట



సిద్దిపేట పట్టణంలోని సిరి పిల్లల ఆసుపత్రిలో ఓ శిశువుకు చేసిన అరుదైన చికిత్స విజయవంతమయింది. నెలలు నిండని శిశువుకు డుయోడెనాల్ ఆట్రేసియా అనే పిడియాట్రిక్ సర్జరీ చేశారు ఆ ఆసుపత్రి వైద్యులు. కేవలం 1.4 కిలోల బరువున్న నెలలు నిండక ముందే పుట్టిన ఓ చిన్నారికి అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా చేశామని ఆసుపత్రి వైద్యులు డా. విక్రమ్, డా. సాయిరాం, డా. రమేష్ నాయక్ లు వెల్లడించారు. 31 వారాల గర్భంతోనే పుట్టి, కేవలం 1.4 కిలోల బరువు మాత్రమే ఉండటం, నెలలు నిండకముందే పుట్టడంతో ఇలాంటి పిల్లలకు సర్జరీ చేయడం చాలా కష్టమని కానీ తమ వైద్య బృందం ఎంతో శ్రమించి ఈ సర్జరీ చేసినట్లు తెలిపారు. ఈ సర్జరీ లో ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్రాన్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

తాత్కాలిక బోదన సిబ్బంది దరఖాస్తులు..

నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఇంగ్లీష్ మీడియంలో భౌతిక శాస్త్రం భోదనకు తాత్కాలిక ప్రాతిపదికన సిబ్బంది నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రత్యేకాధికారి శ్వేత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ విద్యార్హతతో టెట్ అర్హత సాధించిన ఆసక్తిగల మహిళ అభ్యర్థులు ఈ నెల 5 నుంచి10 వరకు కేజీబీవీలో దరఖాస్తులు సమర్పించాలని ప్రత్యేకాధికారి తెలిపారు.

గెస్ట్ టీచర్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలం నర్మెటలో ఉన్న కేజీబీవీలో గెస్ట్ టీచర్ హిందీ బోధనకు దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేక అధికారి పద్మ తెలిపారు. హిందీ లాంగ్వేజ్ పండిట్ శిక్షణా పూర్తి చేసి ఉండి ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు ఈ నెల 6 వరకు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవలన్నారు. ఈ విద్యా సంవత్సరం వరకు మాత్రమే పని చేయాల్సి ఉంటుందన్నారు. మెరిట్, డెమో ప్రకారం ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు బేస్


నవతెలంగాణ-గజ్వేల్



పారిశుద్ధ్య కార్మికుల సేవలు బేస్ అని మున్సి పల్ చైర్మెన్ నేతి చిన్న రాజమౌళి, కమిషనర్ గోల్కొండ నరసయ్య అ న్నారు. మంగళవారం ప్రజాపాలన భాగంగా గజ్వేల్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంగడి బజారు హనుమాన్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మాత్రలు అందించారు. మున్సిపల్ పరిధిలోని పలు వార్డులో శుభ్రం చేయించమన్నారు. ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తామని చెప్పారు. మున్సిపల్ కార్మికులు ఆరోగ్యం ఉంటే గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాకుండా సామూహిక భోజనాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్ తోపాటు మున్సిపల్ వైస్ చైర్మెన్ జాకీర్, వార్డు కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వచేసిన మట్టి 5న వేలం

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల మండలం కడవేరుగు గ్రామ శివారులో అక్రమంగా నిల్వచేసిన మట్టిని గుర్తించి సీజ్ చేసినట్లు తహసీల్దార్ మహమ్మద్ సమీర్ హమీద్ హమ్మద్ ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా తహసీ ల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ సీజ్ చేసిన 200ల ట్రాక్టర్ల మట్టిని 5న (గురువారం)ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొన వచ్చని పేర్కొన్నారు.

అతిధి మహిళా అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-చేర్యాల : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్, నర్సింగ్ బోధించేందుకు అతిథి మహిళా అధ్యాపకుల కోసం దరఖాస్తులను కోరుతున్నట్లు కస్తూర్బా గాంధీ జూనియర్ కళాశాల ప్రత్యేక అధికారిణి కృష్ణవేణి తెలిపారు. కళాశాలలో మంగళవారం కృష్ణవేణి మాట్లాడుతూ ఇంగ్లీష్ బోధించేందుకు పీజీ, బీఈడీ, నర్సింగ్ బోధించేందుకు బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగి ఉండాలని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 4 నుంచి 9 వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కళాశాలలో సంబంధిత సర్టిఫికెట్స్, ఆధార్, ఫోటోతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వేతనం నెలకు రూ.23 వేలు అందిస్తారని, ఈ విద్యాసంవత్సరం పరీక్షల వరకు మాత్రమే పని చేయాల్సి ఉంటుందని తెలిపారు.

ఇథనాల్ పరిశ్రమలను ప్రభుత్వం రద్దు చేయాలి

- అఖిలపక్షం నాయకుల డిమాండ్



నవతెలంగాణ-బెజ్జంకి

మానవ మనుగడకు విషం చిమ్మే మండల పరిధిలోని గుగ్గిల్ల, పోతారం గ్రామ శివారుల్లో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమలను రద్దు చేయాలని మండలంలోని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ ఆవరణం వద్ద అఖిలపక్షం నాయకుల అధ్వర్యంలో ఇథానాల్ పరిశ్రమల వల్ల భవిష్యత్తులో మండలంలో సంభవించనున్న ముప్పుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నిర్మల్ జిల్లా దిలావర్ పూర్ లోని ఇథానాల్ పరిశ్రమను రద్దు చేసిన ప్రభుత్వం బేషరతుగా మండలంలో నిర్మిస్తున్న పరిశ్రమలను రద్దు చేయాలని రైతుల పక్షాన నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక రైతాంగ భవిష్యత్తుకు ముప్పు వాటిల్లకుండా ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఇథనాల్ పరిశ్రమల రద్దుకు ప్రత్యేక చొరవచూపాలని కోరారు. దిలావర్ పూర్ రైతాంగ పోరాట స్ఫూర్తితో ఇథనాల్ పరిశ్రమల పరిసర ప్రాంతాల రైతులను క్షేత్రస్థాయిలో సందర్శించి ఇథానాల్ పరిశ్రమల వల్ల ముప్పును చైతన్యపర్చి ఉద్యమించడానికి ప్రణాళికలు రూపొందిస్తామని అఖిలపక్షం నాయకులు నిర్ణయించారు. మండలంలోని ఇథనాల్ పరిశ్రమలను ప్రభుత్వం బేషరుతుగా రద్దు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తే అఖిలపక్షం అధ్వర్యంలో బలమైన పోరాటాలు చేపట్టి ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ(ఎం), సీపీఐ, బీజేపీ, బీఆర్ఎస్, బీఎస్పీ నాయకులు హజరయ్యారు.

జాతీయస్థాయి బేస్ బాల్‌కు బానోతు రోహిత్

- తొలి అడుగు నంగునూరు మండలం

నవతెలంగాణ -నంగునూరు



సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం గట్ల మల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి బానోతు రోహిత్ నాయక్ బేస్ బాల్ క్రీడలో జాతీయస్థాయి పోటీలకు ఎంపిక య్యాడు. గట్ల మల్యాల ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు డి.రాజ్ కుమార్ వద్ద బానోతు రోహిత్ నాయక్ బేస్ బాల్ క్రీడలో శిక్షణ పొందాడు. ఈ క్రీడలో దర్శనాల రాజ్ కుమార్ శిక్షణ లో మెళకువలు నేర్చుకున్నాడు. క్రీడలో లోపాలను ఎప్పటి కప్పుడు సరి దిద్దుకుని ఉత్తమ క్రీడాకారునిగా ఎదిగాడు. పాఠశాల క్రీడా సమాఖ్య(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యం లో నిర్వహించిన క్రీడా పోటీల్లో మండల, జిల్లా స్థాయిల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచాడు. దీంతో జిల్లా స్థాయి ఎంపిక కమిటీ బి.రోహిత్ నాయక్ ను రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపిక చేసింది. గత నెల(నవంబర్) 16 వ తేదీ నుంచి 18 వ తేదీ వరకు నిర్మల్ లో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలలో సిద్దిపేట జిల్లా తరపున ఆడాడు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబ రిచిన బి.రోహిత్ నాయక్ ను జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపిక చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల (డిసెంబర్) 17 వ తేదీ నుంచి 20 వ తేదీ వరకు 68వ జాతీయస్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీల్లో ఆడనున్నాడు. తెలంగాణ రాష్ట్రం తరపున జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీలలో పాల్గొంటారని గట్లమల్యాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాదాసు రమేష్ తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మెన్ బానోతు సరోజన, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు విద్యార్థికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు డి.రాజ్ కుమార్ ను, జాతీయ స్థాయి బేస్ బాల్ ఎస్.జి.ఎఫ్. పోటీలకు ఎంపికైన విద్యార్థి బానోతు రోహిత్ కుమార్ ను అభినందించారు.

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

నవతెలంగాణ-మర్కుక్



దివ్యాంగులు అంగ వైకల్యంతో కుమిలిపోవాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం దివ్యాంగులను అన్నిరకాలుగా ప్రోత్సహిస్తోందని జిల్లా ఐసీ కోఆర్డినేటర్ రంగనాథ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన మర్కుక్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పాఠశాల ప్రదానోపాధ్యాయులు వెంకటేశం అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రపంచ దివ్యాంగుల దినోత్స వం సందర్భంగా ఆయన జిల్లా దివ్యాంగులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాం గులు ఆత్మ న్యూనతా భావాన్ని పక్కన పెట్టి ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తే సాధించలేనిది ఏమీ లేదన్నారు. జిల్లాలోని దివ్యాంగులకు గుర్తించి కావలసిన పరికరాలను, వస్తువులను వారికి అందజేస్తామన్నారు. మండల విద్యాధి .కారి ఏ .వెంకట్ రాములు మాట్లాడుతూ బి3శాతం మంది పిల్లలు దివ్యంగులు బడికి దూరంగా ఉంటున్నారని, వారిని సహవిద్యతో ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పించి బడిలో చేర్పిస్తున్నారన్నారు . వీరి కోసం ప్రత్యేక విద్యను ,ఐఈఆర్పీ ని మన మండలం లో నియమించి సేవలు అందిస్తు న్నారన్నారు, ఇప్పటికి 15 మంది గుర్తించి వారికి కావలిసిన స్పెషల్ ఎడ్యుకేషన్ అందిస్తిన్నారని చెప్పారు. ఈ సందర్భంగా మండలం లోని దివ్యాంగులైన విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం ఛేశారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాలు వెంకటేశం, పీఆర్టీయూ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రావు ,స్పెషల్ ఎడ్యుకేటర్ రమ్య, సహవిద్య రిసోర్స్ పర్సన్లు రజిత, అరుణ, మండల రిసోర్స్ పర్సన్స్ లచ్చి రాం నాయక్ అంజలి,దివ్యంగులు పిల్లల తల్లి దండ్రులు ,తదితరులున్నారు

సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులుగా మూడోసారి ఆలేటి

నవతెలంగాణ-మద్దూరు



సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కమిటీ సభ్యులుగా మద్దూరు మండలంలోని వల్లం పట్ల గ్రామానికి చెందిన ఆలేటి యాదగిరి, మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గజ్వేల్ పట్టణంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా మూడో మహాసభల్లో గత మూడేండ్లుగా సిద్దిపేట జిల్లాలో ప్రజా పోరాటాలు ప్రజా సమస్యలపై చేసిన అనేక ఉద్యమాలు పోరాటాలను సమీక్షించుకొని రాబోవు మూడు ఏండ్ల పాటు అన్ని వర్గాల్లో ఉన్న సమస్యలపై ప్రజా పోరాటాలకు రూపకల్పన చేసినట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని తెలిపారు.

సాక్షులను బెదిరిస్తున్న నిందితులపై కేసు నమోదు చేయాలి

నవతెలంగాణ-సిద్దిపేట :



కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముద్దాపురం గ్రామంలో దళితులపై దాడి చేసిన కేసులో బాధితులను, సాక్షులను కేసు ఉపసంహరిం చుకోవాలని బెదిరిస్తూ సాంఘిక బహిష్కరణకు పాల్పడు తున్న నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ నిందితుల పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మెన్, సిద్దిపేట పోలీస్ కమిషనర్, కుకునూర్ పల్లి ఎస్సైని బాధితులతో సాక్షులతో కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. 2021 ఏడాదిలో దసరా వేడుకల్లో దళితులపై దాడి చేసిన సంఘటనలో 19 మంది పై కేసు నమోదు అయిందన్నారు. ప్రస్తుతం ఈ కేసు సంగారెడ్డి ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో ట్రయల్ జరుగు తున్నందు కేసును ఉపసంహరించుకోవాల ని బాధితులను, సాక్షులను బెదిరిస్తూ భయాబం తులకు గురి చేస్తున్నారన్నా రు. బాధి తులతో సాక్షులు ఎవరు మాట్లా డొద్దని, మాట్లాడితే రూ.50 వేల జరిమానా విధిస్తామని హెచ్చరిస్తున్నారని ఆరోపిం చారు. అంతేకాకుండా బాధితుల సాక్షులను పను లకు పిల వద్దని, వారి ఇండ్లలో పాలు పోయొద్దని, వారి ఇల్లు కట్టదని, వారికి వ్యవసాయనికి నీరు అందించద్దని తదితర రూపాల్లో వేధిస్తున్నాం న్నారు. బాధితు లకు, సాక్షులకు రక్షణ కల్పించా లని డిమాండ్ చేశారు. సాంఘిక బహిష్కరణకు ప్రయ త్నిస్తున్న నిందితులపై మరో కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులికల్పన, జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు, జిల్లా ఉపాధ్యక్షులు భీమ్ శేఖర్, బాధితులైన రాజవ్వ, పెద్ద నరసయ్య, పాల్గొన్నారు.

విజయోత్సవాలు కాదు..హామీలు అమలు చేయాలి



నవతెలంగాణ-నంగునూరు : కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి ఏడాది పూర్తి అయిందని ఉత్సవాలు, వేడుకలు చేసుకోవడం కాదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేసి అప్పుడు విజయోత్సవ వేడుకలు చేసుకుంటే బాగుంటుందని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మెన్ ఎడ్ల సోమిరెడ్డి, మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ రాగుల సారయ్యలు హితవు పలికారు. మంగళవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆనగోని లింగం గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్నవి వైద్య ఆరోగ్య ఉత్సవాలు కాదు అని, అనారోగ్య ఉత్సవాలని ఎద్దేవా చేశారు. పల్లెల్లో, పట్టణాల్లో నిధులు లేక పారిశుధ్యం పడకేసిందని, గ్రామాల్లో పారిశుద్ధ్యం, బ్లీచింగ్ లేక ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస మందుల కొరత ఏర్పడి ప్రజలకు వైద్య సేవలు అందడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రైసింగ్ నెంబర్ 1 ప్రకటనలు చేసుకోవడం సిగ్గు చేటని, మహిళలకు రూ.2500 భృతి ఇవ్వనందుకా, సంపూర్ణ రుణమాఫీ చేయనందుకా, ఆటో కార్మికులకు రూ.12వేలు జీవనభృతి ఇవ్వకుండా మొండి చేయి చూపినందుకా.. ఎందులో రాష్ట్రం రైసింగ్ నెంబర్ వన్ అయిందని అని ప్రశ్నించారు. ప్రజల పై అనేక రకాలుగా భారం మోపుతే మాత్రం రాబోయే రోజుల్లో ప్రజలు ఆగ్రహానికి గురికాక తప్పదని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ పంగ కుమార్ పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

- సిద్దిపేట అర్బన్ ఏఓ శ్రీనాథ్



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

యాసంగిలో వేరుశనగ సాగుచేయడం రైతులకు లాభదాయ కంగా ఉంటుందని, మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా రైతులు మంచి దిగుబడులు పొందవచ్చని సిద్దిపేట అర్బన్ మండల ఏఓ శ్రీనాథ్ అన్నారు. మంగళవారం అర్బన్ మండలంలోని మందపల్లి గ్రామంలో వేరుశనగ పంట సాగు చేస్తున్న రైతు వీరన్నపేట జైపాల్ రెడ్డి పొలాన్ని సందర్శించి సలహాలు, సూచనలు చేశారు. విత్తనాలను నవంబర్ నెల చివరి వారంలోపు విత్తుకోవడం ద్వారా మంచి దిగుబడి సాధించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

తెగుళ్ల నివారణకు విత్తనశుద్ధి..

కిలో విత్తనానికి 1 గ్రా టెబుకోనజోల్ 2డిఎస్ లేదా 3 గ్రా మాంకోజెబ్ పొడి మందు పట్టించాలి. కాండం కుళ్ళు వైరస్ తెగులు ఆశించే ప్రాంతాలలో ఒక మి.లీ. ఇమి డాక్లోప్రిడ్ 600 ఎఫ్.ఎస్ ను 7 మి.లీ. నీటిలో కలిపి ఒక కిలో విత్తనానికి పట్టించాలి. వేరుపురుగు ఉధృతి ఎక్కువగా ఆశించే ప్రాంతాలలో 6.5 మి.లీ. క్లోరిపైరిఫాస్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి. వరి మాగాణుల్లో లేక కొత్తగా వేరుశనగ సాగు చేసేటప్పుడు కిలో విత్తనానికి 200 గ్రా. రైజోబియం కల్చర్ ని పట్టించాలి. వేరుకుళ్లు, మొదలు కుళ్లు, కాండం కుళ్లు వంటి తెగుళ్ల ఎక్కువగా ఆశించే పరిస్థితులలో కిలో విత్తనానికి 10 గ్రా. ట్రైకోడెర్మా విరిడిని పట్టించి మంచి ఫలితాలు పొందవచ్చు. **విత్తే దూరం..** యాసంగిలో నీటి పారుదల క్రింద సాగుచేసేటప్పుడు 22.5"10 సెం.మీ. దూరంలో విత్తుకోవాలి. అంతే కాకుండా ఎరువుల వేసే సమయం, ఎంత మోతాదులో వేయాలో, భూసారవంతం గురించి, కలుపు నివారణ గురించి, అంతరంగా కృషి ఎలా చేయాలని సవివరంగా ఆయన వివరించారు.

వన్యప్రాణుల సంరక్షణ, అడవుల రక్షణపై అవగాహన

నవతెలంగాణ-చేర్యాల



వన్యప్రాణుల సం రక్షణ, అగ్నిప్రమాదాల నుంచి అడవులను ఎలా కాపాడుకోవాలో అనే దాని పై ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వై.రాముడు విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండల పరిధిలోని నాగ పురి ఉన్నత పాఠశాలలో మంగళవారం వన్యప్రాణుల సంరక్షణ, అగ్ని ప్రమాదాల నుంచి అడవుల రక్షణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాముడు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడడం 'జంతువులను సంరక్షించడం, అడవుల్లో జరిగే అగ్ని ప్రమాదాల రకాలను వాటి నివారణ మార్గాల పద్ధతులను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎలికట్టె అయిలయ్య, ఉపాధ్యాయులు టి.పద్మ ఎస్.నిరూపమ, ఏ.విజయ్ కుమార్, టి. మనోజ్ కుమార్, జి.ప్రకాష్ రెడ్డి, కే. మాధవి, సిహెచ్. యాదగిరి,విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల్ని విద్యాశాఖలో విలీనం చేయాలి

నవతెలంగాణ -దుబ్బాక



గత సర్కారు హయాంలో సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని కోరుతూ చేపట్టిన దీక్షకు అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్ రెడ్డి మద్దతు తెల్పడమే కాకుండా కాంగ్రెస్ సర్కారు వచ్చిన వెంటనే విలీనం చేస్తామని చెప్పి నేటికీ చేయడం లేదని, వెంటనే సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం దుబ్బాక మండల అధ్యక్షుడు దొమ్మాట దేవరాజు డిమాండ్ చేశారు. మంగళవారం దుబ్బాక పట్టణంలోని మండల వనరుల కేంద్రం వద్ద ఎస్ఎస్ఏ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి మండల విద్యాధికారి జే ప్రభుదాస్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 12 ఏళ్లుగా విద్యాశాఖలో సేవలందిస్తున్న ఎస్-ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి ఎంటీఎస్ విధానాన్ని ప్రకటించాలని సీఎం రేవంత్ రెడ్డిని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసనలో ఎస్-ఎస్ఏ ఉద్యోగులు గణేష్, శ్రీధర్, నరసింహ చారి, నాగరాజు, గణేష్, శ్రీనివాస్, శేఖర్, మల్లికార్జున్, మధు, భగవాన్, బాలరాజ్, మల్లేశం, రవి, పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-కోహెడ



విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏఎస్ఐ పవన్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని తంగళ్ళపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బాడ్ టచ్, ఈవిటీజింగ్ నూతన చట్టాలపై వివరించారు. సెల్ఫ్ కాన్ఫిడెన్స్, సెల్ఫ్ డిఫెన్స్, మహిళల పిల్లల రక్షణకు ఉన్న చట్టాలు, సోషల్ మీడియా వల్ల జరుగు నష్టాలపై విద్యార్థులకు తెలిపారు. విద్యార్థి దశ కీలకమని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రవర్తించి క్రమశిక్షణతో ముందుకు వెళ్లాలని సూచిం చారు. చదువుకునే సమ యంలో ఎలాంటి చెడు అలవాట్లకు, ఆలోచ నలకు తావియ్యకూడదన్నారు. ఇతరులు అవహేళనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే డయల్ 100 కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యా యులు, హుస్నాబాద్ షీటీమ్ బృందం సదయ్య , హెడ్ కానిస్టేబుల్, మహిళా కానిస్టేబుల్, ప్రశాంతి, కానిస్టేబు ల్‌లు కృష్ణ, శివకుమార్, పాల్గొన్నారు.

అప్పులు తీర్చే దారిలేక మేస్త్రి ఆత్మహత్య

నవతెలంగాణ- దుబ్బాక



తన భార్య, తన ఆరోగ్యం కోసం చేసిన అప్పుల్ని తీర్చే దారిలేక తీవ్ర మనోవేదనకు గురై ఓ మేస్త్రీ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన దుబ్బాక పట్టణ కేంద్రంలోని రేపల్లెవాడలో మంగళవారం ఉదయం జరిగింది. ఎస్ఐ వీ.గంగరాజు తెలిపిన వివరాలు.. రేపల్లెవాడకు చెందిన బండి వెంకటి (65) మేస్త్రి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్నాళ్లుగా వెంకటి ఆరోగ్యం, తన భార్య ఆరోగ్యం బాగుకోసం అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలా అంటూ తరచూ కుటుంబసభ్యులతో బాధపడే వాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంట్లోనే ఓ గదిలో తాడుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి కిందకు దించగా అప్పటికే చనిపోయాడు. మృతుని కుమారుడు బండి దేవరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విత్తన దుకాణాల ఆకస్మిక తనిఖీ

-జిల్లా వ్యవసాధికారి రాధిక

నవతెలంగాణ-మర్కూక్



విత్తన డీలర్లలందరూ స్టాక్, ధరల పట్టిక బోర్డులను రైతులకు కనపడేవిధంగా ఏర్పాటు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి రాధిక సూచించారు. మంగళవారం మండల పరిధిలోని గణేశ్ పల్లి, వర్ధరాజ్‌పూర్ గ్రామంలోని విత్తన షాప్‌లపై ఆకస్మిక తనిఖీలు చేసి, పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తన డీలర్సులందరూ దుకాణ సముదాయాలలో స్టాక్, ధరల పట్టిక బోర్డులను రైతులకు కనపడేవిధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. వ్యాపారులు విత్తనాల బిల్లులు, ఇన్వాయిస్‌లను తనిఖీ సమయంలో అధికారులకు చూపాలన్నారు. విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు బిల్లులను తీసుకుని పంట కాలం పూర్తయ్యేవరకు జాగ్రత్తగా భద్రపరచు కోవాలని సూచించారు. తగు నిబంధనలు పాటించని వ్యాపారుల పై చర్యలు శాఖపరమైన తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిద్ధిపేట సహాయ వ్యవసాయ సంచాలకులు మండల వ్యవసాయ అధికారి టి.నాగేందర్ రెడ్డి, రైతులు, తదితరులున్నారు.

ఆశా వర్కర్ల పెండింగ్ బిల్లును వెంటనే చెల్లించాలి

-పీహెచ్సీలో వినతిపత్రాన్ని అందించిన ఆశ వర్కర్లు

నవతెలంగాణ-మిరుదొడ్డి



ఆశా వర్కర్ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ అక్బర్ పేట-భూంపల్లి మండలం కార్యదర్శి ఎల్లం, మిరుదొడ్డి మండల కార్యదర్శి అంజయ్యలు అన్నారు. మంగళవారం అక్బర్పేట-భూంపల్లి, మిరుదొడ్డి మండలాల్లో ఆశా వర్కర్లు వారి సమస్యలు పరిష్కరించాలని పిహెచ్సిలో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆశ వర్కర్లతో వెట్టిచాకిరి చేయించుకుంటుందని మండిపడ్డారు. పనికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి ఇంటింటా సర్వే చేయించి పనికి తగిన వేతనం ఇవ్వకపోవడంతో ఆశా వర్కర్లకు తీవ్ర ఇబ్బంది అవుతుందని తెలిపారు వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కనీస వేతన చట్టం ప్రకారం రూ.25వేల వేతనాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీనివాస్‌తో పాటు వివిధ గ్రామాల ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఎస్సీ కార్పొరేషన్ అధికారి

నవతెలంగాణ-సిద్ధిపేటకలెక్టరేట్



సిద్ధిపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారి(ఈడి) ఇన్చార్జిగా రామాచారి. రాష్ట్ర ఎండిగా ఆదేశాల ప్రకారం మంగళవారం నుంచి ఇన్చార్జి తీసుకోన్నారు. అనంతరం మర్యాదపూ ర్వకంగా జిల్లా కలెక్టర్ ఎం మను చౌదరి చౌదరి నీ కలసి పూల మొక్క ను అందజేసినారు . ఈడి మాట్లాడుతూ జిల్లాలో దళితులకు సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూస్తానని తెలిపారు మరియు ఇప్పటివరకు కొనసాగించిన ఈడీగా శ్రీరామ్ రెడ్డిని ఆయన సొంత శాఖకు బదిలీ అయినారు.

టీఆర్ జీపీఏ జిల్లా అధ్యక్షునిగా మహేశ్

నవతెలంగాణ-నంగునూరు



తెలంగాణ గురుకుల పాఠశాలల పేరెంట్ అసోసియేషన్ సిద్ధిపేట జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షునిగా నంగునూరు మండలం బద్దిపడగ గ్రామానికి చెందిన సుంచు మహేశ్ నియమితులయ్యారు. టీఆర్ జీపీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు రేగుంట లింగయ్య మంగళవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ జిల్లా లోని గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తనపై నమ్మకంతో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించిన లింగయ్యకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

శానిటేషన్ వర్కర్స్‌కు ఆరోగ్య పరీక్షలు

నవతెలంగాణ-చేర్యాల



ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం చేర్యాల పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్ వర్కర్స్‌కు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూప రాణి, కమిషనర్ ఎస్.నాగేందర్, కౌన్సిలర్ ఆడెపు నరేందర్, మేనేజర్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హుండీని ఎత్తుకెళ్లిన దొంగల అరెస్ట్

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల మండలం కడవేరుగు గ్రామంలోని కనకదుర్గ మాత ఆల యంలో గత నెల 30 రాత్రి దొంగతనం చేసి హుండీని దొంగిలించిన పెద్దపల్లి జిల్లా హన్మంతుల పేట గ్రామానికి చెందిన త్రిదండి పని అనిల్, పైడి అజయ్‌లను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పీ. నీరేశ్ తెలిపారు.

మైనార్టీ గురుకులాలను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

నవతెలంగాణ-సిద్ధిపేట



పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలను అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ మంగళవారం పరిశీలించారు. పిల్లల ఆహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదని సిబ్బందిని ఆదేశించారు. శుభ్రత పాటించాలి అని సూచించారు. హాస్టల్ లోని భోజనశాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి రాత్రి భోజనం చేశారు. హాస్టల్లో ఉన్న వసతుల గురించి, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.

అనుమానిత ప్రాంతాల్లో జాగిలాలతో తనిఖీలు

నవతెలంగాణ-బెజ్జంకి



మండల కేంద్రంతో పాటు బేగంపేట గ్రామాల్లో అనుమానిత కిరాణా, పాన్, ఇతర ప్రాంతాల్లో గంజాయి, మత్తు, నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమ నిల్వలపై ప్రత్యేక పోలీస్ బృందం జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. సీపీ అనురాధ అదేశానుసారం మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపి పూర్తి స్థాయిలో అరికట్టడానికి జాగిలాలతో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్ఐ క్రిష్టారెడ్డి తెలిపారు. యువత మత్తుపదార్థాలకు బానిసవ్వకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని ఎస్ఐ సూచించారు. పోలీసులు కొడిశేల శ్రీనివాస్, జాలిగం రవీందర్, జాగిలాల సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడలు విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నంగునూరు



సీఎం కప్ క్రీడలు-2024 విజయవంతం చేయాలని ఎంపీడీఓ బి.లక్ష్మప్ప సూచించారు. మంగళవారం నంగునూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ క్రీడలు మూడు దశల్లో ఉంటాయని చెప్పారు. ఈ నెల 7-8 తేదిల్లో గ్రామ పంచాయతీ ల్లో,10-12 తేది ల్లో మండల స్థాయిలో, 16-21 తేదిల్లో జిల్లా స్థాయిలో ఉంటాయని పేర్కొన్నారు. మండల స్థాయిలో ఉన్న మెంబెర్స్ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశం లో తహసీల్దార్ జి.సరిత, సూపరింటెండెంట్ ప్రభాకర్ రావు, ఎంపీఓ సత్యనారాయణ, రాజగోపాల్ పేట ఎస్సై అసీఫ్, పీఈటీ రాజమౌళి పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ అధికారులు తదితరులు హాజరైనారు.

శ్రీకాంతాచారికి ఘన నివాళులు

నవతెలంగాణ-కొండపాక



తెలంగాణ సాధన కోసం ప్రాణాలు అర్పించిన కాసోజు శ్రీకాంతాచారి వర్ధంతిని కొండపాకలో మంగళవారం జరిపారు. ఆయన చిత్రపటా నికి పూలమా లవేసి నివాళులర్పించారు. కార్యక్ర మంలో బీఆర్ఎస్ నాయకులు అంబటి బాలచందర్ గౌడ్ ,బొద్దుల రామకిష్టయ్య, భిక్షపతి, కె.కనకరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుబ్బాక



ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆత్మ బలిదానం చేసుకున్న కాసోజు శ్రీకాంతాచారిని స్మరిస్తూ మంగళవారం దుబ్బాక పట్టణంలో స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యం లో శ్రీకాంతచారి చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఆ సంఘం అధ్యక్షులు ఎస్ఎన్ చారి మాట్లాడుతూ.. మలిదశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన శ్రీకాంతచారి ఆత్మ బలిదానం చారిత్రాత్మకమని కొనియాడారు. సంఘ సభ్యులు పీ.ప్రవీణ్ చారి, ఎం.శ్రీనివాస్, ఎం.లక్ష్మణ్, ఎం.కాళిదాస్, ఎం.యతిరాజం, యం.లక్ష్మణ్ చారి పలువురు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) మహాసభలు విజయవంతం

- సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సంద బోయిన ఎల్లయ్య

నవతెలంగాణ-గజ్వేల్



సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా మూడో మహాసభలు గజ్వేల్ పట్టణంలో విజయవంతంగా నిర్వహించడం జరిగిందని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య తెలిపారు. మొదటిరోజు సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలోని ఆంధ్ర బ్యాంకు వద్ద నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా కోలాభిరామ్ గార్డెన్ వరకు ప్రదర్శన ర్యాలీ నిర్వహించడం జరిగిందని ఈ ప్రదర్శనలో సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర అగ్ర నాయకత్వం సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి నాగయ్య,చుక్కా రాములు జిల్లా కార్యదర్శి ఆమదాల మల్లారెడ్డి పాల్గొనడం జరిగిందని జిల్లావ్యాప్తంగా సీపీఐ(ఎం) పార్టీ సభ్యులు సానుభూతిపరులు కార్యకర్తలు కార్మికులు భారీ సంఖ్యలో హాజరై మహాసభలు జయప్రదం చేశారని అన్నారు. మొదటి రోజు సాయంత్రం నుండి రెండో రోజు సాయంత్రం వరకు ప్రతినిధుల సభ నిర్వహించడం జరిగిందని గత మూడు సంవత్సరాల పోరాటాలను, ఉద్యమాలను సమీక్షించుకొని భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకోవడం జరిగిందని, అనంతరం నూతన పార్టీ జిల్లా నాయకత్వాన్ని ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. మహాసభల విజయవంతానికి ఆర్థికంగా, మహాసభల నిర్వహణకు వివిధ రూపాల్లో సహకరించిన ప్రజలకు, శ్రేయోభిలాషులకు,మీడియా మిత్రులకు, అధికారులకు ధన్యవాదములు తెలుపడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మండల కార్యదర్శి సందీటి రంగారెడ్డి, పట్టణ శాఖ కార్యదర్శి వెంకట చారి పాల్గొన్నారు.

లెప్రసి సర్వే నుంచి ఆశా వర్కర్లను తొలగించాలి

- మండల వైద్యాధికారికి వినతి పత్రం అందజేసిన ఆశ వర్కర్లు

నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్



లెప్రసి సర్వే నుంచి ఆశ వర్కర్లను తొలగించి, సమస్యలు పరిష్కరించాలని నారాయణరావుపేట మండల వైద్యాధికారి కి ఆశా వర్కర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఆశ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు శ్రీలత మాట్లాడుతూ డిసెంబర్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో లెప్రసి సర్వే చేయాలని ఆశాలకు జిల్లా అధికారులు ఆదేశాలిచ్చారు. వెంటనే ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆపాలని లెప్రసి, పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు చెల్లించిన తర్వాతనే కొత్త సర్వేలు చేయించాలని అన్నారు. రాష్ట్రంలో 2023లో సగం జిల్లాలకు, 2024లో మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు ఆశాలు చేసిన లెప్రసి డబ్బులు, 2024లో చేసిన పల్స్ పోలియో డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం నేటికీ ఆశాలకు చెల్లించలేదు. ఈ అంశం పైన కమీషనర్ సంబంధిత అధికారులను మా యూనియన్ ఆధ్వర్యంలో కలిసినప్పుడు లెప్రసి 2 సంవత్సరాల సర్వే డబ్బులు మేము రిలీజ్ చేసి చాలా కాలమైందని సర్వేకు ముందే ఈ బడ్జెట్ మేము రిలీజ్ చేస్తున్నామని తెలియజేస్తూ మాకు బడ్జెట్ వివరాలతో కూడిన సంబంధిత ప్రొసీడింగ్ ఆర్డర్స్ అందజేశారు. ఈ ఆర్డర్ కాపీలు తీసుకొని అన్ని జిల్లాల్లో డీఎంహెచ్. ఓ అధికారులను కలిసి పెండింగ్ లెప్రసి సర్వే డబ్బులు చెల్లించాలని కోరారు. సంవత్సరాల తరబడి చేసిన పనికి డబ్బులు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తూ, ఇప్పుడు మళ్లీ కొత్తగా లెప్రసి సర్వే చేయాలని ఒత్తిడి చేయడం ఎంతవరకు న్యాయమని ఆశా వర్కర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పెండింగ్ బిల్లులు చెల్లించి ఆశాలను ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు శోభ, భవాని, పాల్గొన్నారు

గత నేరచరిత్ర చూసుకో..

నవతెలంగాణ-సిద్ధిపేట



మచ్చలేని మనిషి అయిన హరీశ్‌రావు పై నిరాధార ఆరోపణలు చేసే ముందు చక్రధర్ గౌడ్ తన నేరచరిత్ర గురించి ఒకసారి వెనక్కి తిరిగి చూసుకోవాలని సిద్ధిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ పాల సాయిరాం, నంగునూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ ఎడ్ల సోమిరెడ్డి, ఎల్లారెడ్డి, శ్రీకాంత్ గౌడ్‌లు అన్నారు. సిద్ధిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో బీఆర్ఎస్ నాయకులు ఎల్లారెడ్డి తో కలిసి వారు మాట్లాడుతూ.. ఎప్పుడు ఏ పార్టీలో ఉంటాడో తెలియని నీకు హరీశ్‌రావు గురించి కనీసం మాట్లాడే అర్హత కూడా లేదన్నారు. నేర చరిత్ర, క్రిమినల్ చరిత్ర కలిగిన వారిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడమే కాంగ్రెస్ నాయకులు పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. హరీశ్‌రావుపై అసత్య ఆరోపణలు, అబద్ధాలు మాట్లాడిన వారికి ఇస్తామని వారికి పోటీ పెట్టినట్లుగా కాంగ్రెస్ నాయకులు సిద్ధిపేటలో వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎవరు ఎన్ని అసత్య ఆరోపణలు హరీశ్‌రావుపై చేసిన ప్రజలు వాటిని నమ్మరని తెలిపారు. ఈ సమావేశంలో బీ ఆర్ ఎస్ నాయకులు మెరుగు మహేష్, మాజీ సర్పంచ్‌లు లింగం, నరేష్ గౌడ్, నాగుల ప్రశాంత్ గౌడ్, రమేష్, సాయి ప్రేమ్, నాగరాజు, సాయి చరణ్ గౌడ్ పాల్గొన్నారు.

జనవరి 11న జిల్లా బాడీ బిల్డింగ్ పోటీల ఎంపికలు

- జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొండం సంపత్ రెడ్డి

నవతెలంగాణ-సిద్ధిపేట



జనవరి 11న జిల్లా బాడీ బిల్డింగ్ పోటీలు, ఎంపికలు నిర్వహిస్తామని జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొండం సంపత్ రెడ్డి తెలిపారు. మంగళవారం అయన మాట్లాడుతూ సిద్ధిపేట జిల్లా ఆమెచూర్ బాడీ బిల్డింగ్ ఫిట్నెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బాడీ బిల్డింగ్ ఫిట్నెస్ పోటీలు, ఎంపికలు నిర్వహిస్తామన్నారు. వచ్చే నెల11న సాయంత్రము 6 గంటలకు స్థానిక విపంచి ఆడిటోరియం నిర్వహిస్తున్నట్లు సంగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏరువా అశోక్ తెలిపారు. 50 నుంచి 55 బరువు, 55- 60, 60 - 65, 65 - 70, 80 -85 కేజీల విభాగాలు పోటీలు నిర్వహిస్తూ, గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని తెలిపారు. మిస్టర్ సిద్ధిపేటగా గెలుపొందిన బాడీ బిల్డర్ కు ప్రైజ్ మనీ బహుమతిగా ఇవ్వబడుననీ తెలిపారు. ఈ సమావేశంలో సంగం కోశాధికారి బాలగోని సత్యం గౌడ్, కార్యవర్గ సభ్యులు సిద్దులు, శేఖర్, షౌకత్, అఫ్సర్, అథ్లెటిక అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు





నవతెలంగాణ -దుబ్బాక

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి అధ్యక్షతన మంగళవారం దుబ్బాక మున్సిపల్ కార్యాలయం నుంచి పలు వీధుల గుండా విద్యార్థులు, మున్సిపల్ సిబ్బందితో కలిసి ర్యాలీని నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ కే.రమేష్ కుమార్ తెలిపారు. వారు మాట్లాడుతూ..మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న 45 మంది పారిశుధ్య కార్మికులకు సేఫ్టీ కిట్లను అందజేసి శాలువాలతో సత్కరించడం జరిగిందన్నారు. అనంతరం మున్సిపల్ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులకు తిమ్మాపూర్ పీహెచ్ సీ వైద్య బృందం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరంలో భాగంగా మందుల్ని పంపిణీ చేయడం జరిగింది. ఆ తర్వాత మహిళా సంఘాలు, స్ట్రీట్ వెండర్ వ్యాపారస్తులకు మెప్మా ఆధ్వర్యంలో బ్యాంకు రుణాల చెక్కులను అందజేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట మెప్మా ఆర్పీలచే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, రంగవల్లుల పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ఉత్సవాలలో ఎంఈఓ జే.ప్రభుదాస్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సీఓ రేణుక, ఆర్పీలు, వార్డు ఆఫీసర్లు, పలువురు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్ధిపేట

ప్రజా పాలన దినోత్సవ వేడుకలు పట్టణంలో కమిషనర్ అశ్రిత్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద రెండు కిలోమీటర్ల పరుగు పందెం నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ సిబ్బందికి 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించారు. పరిశుభ్రత కృషి చేస్తున్నటువంటి పారిశుధ్య కార్మికులకు , విద్యుత్తు, నీటి సరఫరా లైన్ మెన్ లకు సిబ్బంది ఎల్ వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వారిచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న చెత్తకుప్పలను తొలగించి, అట్టి ప్రాంతంలో మరోసారి ఎవరు కూడా చెత్త వేయకుండా ఉండడానికి అవగాహన కలిగేలా రంగురంగుల ముగ్గులను వేసి మొక్కలను నాటారు. ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా విధులు నిర్వహిస్తూ, పట్టణ పరిశుభ్రతకు కృషి చేసిన ఆరుగురు కార్మికులకు సన్మానించారు. కార్మికులందరికీ బట్టలు, చీరలు, ఆప్రాన్, సురక్షిత బూట్లు, కొబ్బరి నూనె, సబ్బులు, మాస్కులు, గ్లౌజులు, చీపురులను అందజేశారు. మెప్మా మహిళా సంఘాలకు బ్యాంకు రుణాల పంపిణీ, వీధి వ్యాపారాలకు రుణాల పంపిణీ, దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగులకు రుణాలు పంపిణీ చేశారు. సిద్ధిపేట పురపాలక సంఘంలో స్వచ్ఛత హీ సేవ - 2024 కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పొడి చెత్త సేకరణలో అత్యధిక ప్రతిభ కనబరిచినటువంటి పారిశుధ్య కార్మికులకు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపోస్టు డెవలప్మెంట్ ఆఫీసర్ హేమలత, మున్సిపల్ అని విభాగాలు ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రుణమాఫీ చేయడంలో రేవంత్ సర్కార్ విఫలం

- బీఆర్ఎస్ రాష్ట్ర యూత్ వింగ్ ఉపాధ్యక్షులు జుబేర్ పాషా

నవతెలంగాణ-మర్కూక్



రైతు రుణమాఫీ చేయడంలో రేవంత్ సర్కార్ విఫలమైయిందని బీఆర్ఎస్ రాష్ట్ర యూత్ వింగ్ ఉపాధ్యక్షులు జుబేర్ పాషా అన్నారు. మంగళవారం ఆయన నవతెలంగాణ మాట్లాడుతూ..ఆగస్టు 15 తారీఖు లోపు పూర్తిస్థాయి రుణమాఫీ చేస్తానని ప్రజలకు మాటిచ్చిన సీఎం అందులో కనీసం సగం మంది కూడా రుణమాఫీ చేయకపోవడం రైతులను మోసం చేయడమేనన్నారు . ఇప్పటివరకు రూణమాఫీ కేవలం 47శాతం రుణమాఫీ మాత్రమే అని, ఇంకా 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉందని తెలిపారు. అబద్ధపు ప్రసంగాలు చేయకుండా పూర్తిస్థాయి రుణమాఫీ చేసి మిగతా 25 లక్షల మంది రైతులను ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 4 విడతలో కొంత మంది రైతులకు రుణమాఫీ చేసి గొప్పలు వేచ్చకోవడం సరి కాదన్నారు. వానాకాలం, యాసంగి రైతు భరోసా డబ్బులను రైతుల ఖాతాలలో వెంటనే వేయాలని డిమాండ్ చేశారు. గ్రామాలలో గ్రామ పంచాయతీలకు నిధులు లేక గ్రామాలు మురికి కుపాలుగా మారయని ఎద్దేవా చేశారు. ప్రజా పాలనలో పాలన గాడి తప్పిందని ఆరోపించారు.

అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి తాడూరి రవీందర్

నవతెలంగాణ-కొమురవెల్లి



కొమురవెల్లి మల్లన్న ఆలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై సెట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఐ(ఎం)మండల కార్యదర్శి తాడూరి రవీందర్ అన్నారు. మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో ఆలయ ఏఈఓ బుద్ధి శ్రీనివాస్ కు వినతి పత్రం అందించారు. అనంతరం రవీందర్ మాట్లాడుతూ ఆలయ రికార్డులను మాయం చేశారనే ఆరోపణలపై, ఇటీవల ప్రసాదంలో పురుగులు, వెంట్రుకలు, ప్రసాదం బరువులు తేడాలపై సమగ్ర విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు కోవాలని డిమాండ్ చేశారు. దేవాలయంలో అవినీతి రోజురోజుకు పెరిగి పోతుందనీ, ప్రధానంగా ఉండి లెక్కింపులో భక్తులు ఇచ్చిన కానుకలు మాయం కావడం, అధికారులు కొట్టుకోవడం, లడ్డు పులిహోర ప్రసాద నాణ్యత ప్రమాణాలు పాటించడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారనీ తెలిపారు. రూ.కోట్ల కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చే విధంగా అధికార పార్టీ నాయకులకు కమిషన్లు ముట్టే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అసమగ్రంగా ఉన్న పనులను పూర్తిచేసి దేవాలయములో జరుగుతున్న అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి వృధా అయిన డబ్బులను రికవరీ చేయాలని లేనిపక్షంలో భక్తులను ఏకం చేసి ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కృష్ణారెడ్డి, తేలు ఇస్తారి, బక్కలి బాల కిషన్ ,సార్ల యాదయ్య సాయిలు, రవి తదితరులు పాల్గొన్నారు

ఉమ్మడి మండల వ్యాప్తంగా జోరుగా కల్తీకల్లు..!

నవతెలంగాణ- దౌల్తాబాద్



ఉమ్మడి దౌల్తాబాద్ మండల వ్యాప్తంగా కల్తీకల్లు దందా జోరుగా నడుస్తుంది. డైజీ ఫామ్, ఆల్ఫ్రోజోలాం వంటి మత్తు పదార్థాలు కలిపి కల్తీ కల్లును తయారు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. కల్తీ కల్లుపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. అది కాకుండా ఎక్సైజ్ అధికారులు ఎవరు ఫిర్యాదు చేస్తే ఫిర్యాదుదారుల పేర్లు సదరు కల్లు దుకాణాల యజమానులకు చెప్తున్నారు. దానివల్ల ఫిర్యాదు చేయడానికి కూడా ప్రజలు వెనుకడుగు వేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులలో కల్లు తయారీదారులు రెచ్చిపోయి యదేచ్ఛగా మరీ కల్తీ కల్లును తయారు చేస్తున్నారు. ఉమ్మడి మండల వ్యాప్తంగా 30 నుంచి 40 వరకు కల్లు డిపోలు ఉన్నాయని విశ్వసనీ య సమాచారం. ఏదైనా ప్రమాదం జరిగితే తప్ప మిగతా సమయం లో ఎక్సైజ్ అధికారులు స్పందించడం లేదని విమర్శలు ఉన్నయి. ఉమ్మడి దౌల్తాబాద్ మండలంలో పెద్దగా తాటి, ఈత చెట్లు లేవు. కానీ ఇంత కల్లు ఎక్కడి నుంచి వస్తోంది అన్నది మాత్రం కొంచెం సందేహించాల్సిందే. ఇకనైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి కల్తీకల్లు వ్యాపారం కొనసాగకుండా స్వచ్ఛమైన కల్లును ప్రజలకు విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు వాపోతున్నారు.

ఎయిడ్స్ నిర్మూలన అవగాహనతోనే సాధ్యం

- డీఎంహెచ్ఓ డాక్టర్ పల్వన్ కుమార్

నవతెలంగాణ-సిద్ధి పేట



ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన అవగాహనతోనే సాధ్యం అని డీఎంహెచ్ఓ డాక్టర్ పల్వన్ కుమార్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎయిడ్స్ వ్యాధి అవగాహన ర్యాలీని జిల్లా వైద్య , ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వన్ కుమార్ జండా ఊపి ప్రారంభించారు. వారితోపాటు, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ అరుణ్ కుమార్, నర్సింగ్ కాలేజ్ వైస్ ప్రినిసిపల్ జయకుమారి, ఆర్ ఎం ఓ డాక్టర్ శ్రావణి, విద్యార్థులు, ఆరోగ్య సిబ్బందితో కలిసి ఈ ర్యాలీని గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రి నుండి డిగ్రీ కళాశాల వరకు కొనసాగించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ నివారణ ప్రతి ఒక్కరు బాధ్యతగా చేపట్టాలని, ఎయిడ్స్ వ్యాధి అంటించుకునే వ్యాధని, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల ప్రేమ చూపాలని, వారి పట్ల వివక్ష చూపకూడదని అన్నారు. సమాజంలో ఎయిడ్స్ పట్ల అవగాహన పెంపొందించాలని , ఎయిడ్స్ వ్యాధి నిర్మూలలో ఆరోగ్య సిబ్బందితోపాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని , విద్యార్థులు డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ఎయిడ్స్ వ్యాధి నిర్మూల కార్యక్రమంలో సేవలందించిన ఉద్యోగులకు, ఆరోగ్య సిబ్బందికి, ఎస్సే రైటింగ్ కాంపిటీషన్లో గెలుపొందిన నర్సింగ్ విద్యార్థులకు, ఎన్జీవోలకు, ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆఫీసర్స్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన

- తొగుట సీఐ లతీఫ్, ఎస్ఐ రవికాంత్ రావు

నవతెలంగాణ-తొగుట



విద్యార్థులు తమ పాఠశాలలో, బయట గాని ఎవ రైన ఈవ్-టీసింగ్ చేసినపుడు భయపడకుండా షీ టీమ్ ద్వారా పోలీస్ లకు సమాచారం అందించాలని తొగుట సీఐ లతీఫ్, ఎస్ఐ రవికాంత్ రావు తెలిపారు. మండలంలోని వెంకట్రావు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు మహిళల చట్టాలు, సైబర్ నేరాల గురించి మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈవ్ - టీసింగ్ గురైనప్పుడు విద్యార్థినులు భయపడకుండా అట్టి విషయాన్నీ షీ టీమ్ ఫోన్ నెంబర్ 8712667434 ద్వారా పోలీస్ వారికి చెప్పాలని సూచించారు. అలా చెప్పిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. అలాగే విద్యార్థినులు తమ సోషల్ మీడియా అకౌంట్‌ల్లో డీపీగా తమ ఫోటో పెట్టుకోకుడదని చెప్పారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వీడి యో కాల్స్ వస్తే వాటిని లిఫ్ట్ చేయవద్దని అన్నారు. ఎవైన ఇబ్బందులు ఉన్నచో భయపడకుండా పోలీస్ వారికి చెప్పాలని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టిజన్ మృతికి కారణమైన అధికారులను సస్పెండ్ చేయాలి

నవతెలంగాణ-గజ్వేల్



ఆర్టిజన్ కృష్ణ మృతికి కారణమైన అధికారులను సస్పెండ్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రెటరీ గుంటుపల్లి సధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖ ట్రాన్స్కో 132 కెవి సబ్ స్టేషన్ నర్సంపేటలో గత పక్షం రోజుల క్రితం ఆర్టిజన్ గ్రేడ్ వన్ కృష్ణతో పెయింటింగ్ వర్క్ చేస్తుండగా ప్రమాదం జరిగి గాయాలతో 12 రోజుల పాటు మృతుతో పోరాడి చనిపోయినట్లు ఆయన తెలిపారు. కాంట్రాక్టర్ చేయవలసిన పనులు ఆర్టిజన్తో చేయించడం సబబు కాదన్నారు. ఆర్టిజన్లకు పని చేయించడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని ఆయన పేర్కొన్నారు. సేఫ్టీ ప్రికాషన్స్ తీసుకోకుండా అధికారుల నిర్లక్ష్యం మూలంగా జరిగిందని ఆయన అన్నారు. సంబంధిత శాఖ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని కృష్ణ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాస్కోలో జరుగుతున్న పరిణామాల పైన క్షేత్రస్థాయిలో విచారణ జరిపి కార్మికులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

కుకునూరు పల్లి పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవం

నవతెలంగాణ-కొండపాక

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం కుకునూరుపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఎంఈఓ బి సత్తయ్య ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు జరిగాయి. దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏ ఎం ఓ భాస్కర్, ఎంఈఓ సత్తయ్య తహసీల్దార్ మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ అవిటితనం అనేది లోపం కాదని వారిని చిన్నచూపు చూడడం తగదన్నారు. వారు కూడా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. స్పెషల్ టీచర్ ప్రశాంత్, ప్రియాంక చోప్రా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సర్వే బకాయిలు చెల్లించే వరకు ఆశాలు ఎలాంటి సర్వేలు చేయరు

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి



నవతెలంగాణ-నార్సింగి

సర్వే బకాయిలు చెల్లించే వరకు ఆశాలు ఎలాంటి సర్వేలు చేయరని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్ల సర్వే బకాయిలు, కనీస వేతనం వంటి 18 డిమాండ్ల పరిష్కారం కోరుతూ అధికారులకు వినతిపత్రం అందజేసేందుకు యత్నించారు. మండల వైద్య ఆరోగ్య అధికారిని రేఖ, డాక్టర్ రవి కుమార్ లేనందున ఆసుపత్రి పీహెచ్ఎన్ రేణుకకు వినతి పత్రం ఇవ్వాలని ప్రయత్నించగా తనకు తీసుకునే అధికారం లేదని నిరాకరించడంతో అసహనం వ్యక్తం చేసిన జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి ఆశాల సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రం ఎవరు ఇచ్చినా, ఎవరికి ఇచ్చినా తీసుకోవాలన్నారు. రేణుక వినతిపత్రం తీసుకోవడానికి నిరాకరించడం సరైన పద్ధతి కాదని, దీనిని సీఐటీయూ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నామని మండి పడ్డారు. పీహెచ్ఎన్ చర్యను ఖండిస్తూ మండల వైద్య ఆరోగ్య అధికారి ఖాళీ కుర్చీ కి వినతి పత్రం సమర్పించారు. అనంతరం బాలమణి మాట్లాడుతూ ఆశా వర్కర్లు గతంలో చేసిన పల్స్ పోలియో, ఫైలేరియా, కుష్టు వ్యాధి సర్వేలు బకాయిలు మూడు సంవత్సరాలుగా చెల్లించలేదని, ఇప్పుడు మళ్ళీ కుష్టు వ్యాధి సర్వే చేయాలని ఆదేశిస్తున్నారన్నారు. బకాయిలు చెల్లించే వరకు ఆశాలు ఎలాంటి సర్వేలు చేయబోరని, బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆశాలకు వెంటనే బకాయిలు చెల్లించాలని, లేక పోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని, బకాయిలు చెల్లించే వరకు ఎలాంటి సర్వే చేయమని మరోసారి హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోసం బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం ఉందని ఆశా వర్కర్లు అందరూ పాల్గొని ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బాల మణి కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చలి ప్రభావం నుంచి వరి నారుమడి రక్షణకు సూచనలు

నవతెలంగాణ-నార్సింగి



యాసంగిలో చలి ప్రభావం నుంచి నారుమడులలో నారు ఎదగక పోవటం, ఆకులు పసుపు, ఎరుపు రంగులోకి, కొన్ని సార్లు నారు చనిపోవటం వంటి వాటిపై రైతులు చేపట్ట వలసిన రక్షణ చర్యలను మండల వ్యవసాయ విస్తరణ అధికారినులు విజృంభణ, దివ్య వ్యవసాయ కార్యాలయంలో వివరించారు. నారుమడి లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తూ సాయంత్రం వేళలో నారుమడి లో నీరు తీసివేసి పగటిపూట వెచ్చటి నీరు పెడుతూ ఉండాలని, రోజు సాయంత్రం ఒక అడుగు ఎత్తులో వెదురు బద్దలు అమర్చి, దానిమీద సన్నటి ప్లాస్టిక్ షీట్ లేదా కల్లాల పట్టాలు తో నారుమడి మీద కప్పి మరుసటి రోజు ఉదయం తీసి వేయాలని తెలిపారు. వరి నారు లో జింకు లోపం వలన ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడుతాయని, నివారణకు జింకు సల్ఫేట్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని అన్నారు. నారు ఆరోగ్యంగా పెరగడానికి యూరియా వేస్తున్నప్పుడు ఒక కిలో యూరియా కి 2 గ్రాముల కార్బెండాజిమ్ తో పాటు మాంకోజెబ్ మిశ్రమ మందును కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కాండం తొలుచు పురుగు బారి నుంచి వరి నారు ని కాపాడుకోడానికి కారొపురాన్ 3 జి గుళికలు ఎకరాకు సరిపడే నారుమడి కి ఒక కిలో చొప్పున చల్లాలన్నారు. చలి తీవ్రత ఎక్కువ ఉండి మంచుతో కూడిన వాతావరణం ఉన్నట్లయితే అగ్గి తెగులు ఆశించకుండా ముందు జాగ్రత్త చర్యగా ట్రైసైక్లేజాల్ 0.6 గ్రాములు లీటర్ నీటికి చొప్పున పిచికారి చేయాలని సూచనలు చేశారు. రైతులకు వ్యవసాయం లో సమస్యలు, సందేహాలు ఉంటే మండల కేంద్రం లోని రైతు వేదిక లోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని రైతులను కోరారు.

అంగ వైకల్యం శరీరానికే గాని ఆత్మవిశ్వాసానికి కాదు

నవతెలంగాణ-నార్సింగి



ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మండల వ్యాప్తంగా "ప్రత్యేక అవసరాలతో ఉన్న పిల్లలకు ప్రధాన ఉపాధ్యాయుడు మురళీ మోహన్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ వైద్యుడు శ్రీనివాస్ వ్యాయామాలు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగ వైకల్యం జీవన సాఫల్యం కోసం అవరోధం కాకూడదని, దివ్యాంగులు ఆత్మ విశ్వాసం తో ముందుకు సాగాలని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎందరో దివ్యాంగులు తమ వైకల్యాన్ని జయించి ఎన్నో విజయాలు సాధించారని, స్టీఫెన్ హాకింగ్ పూర్తి శరీర వైకల్యం తో ఉన్నా ఒక సైంటిస్ట్‌గా ఎన్నో విజయాలు అందుకున్నాడని గుర్తు చేశారు. వైకల్యం శరీరానికేగాని ఆత్మ విశ్వాసానికి ఉండ కూడదని, స్టీఫెన్ హాకింగ్ లాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని విజయాలు సాధించాలని ఉత్తేజ పరిచారు. అనంతరం ప్రత్యేక అవసరాలతో ఉన్న పిల్లలకు వారికి అవసరమైన వ్యాయామాలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బందితో పాటు ఐ.ఆర్.ఈ.పీ సిబ్బంది సుజాత, విజయ, సౌజన్య, దివ్యాంగులు పాల్గొన్నారు.

మైనంపల్లితో పెట్టుకుంటే మసైపోతావ్

- అమర సేనా రెడ్డి

నవతెలంగాణ-నిజాంపేట



ఎంఎస్ఎస్ఓ ద్వారా మెదక్ నియోజకవర్గ ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు అందిస్తున్న మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావును మాజీ జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ విమర్శించడం సరికాదని కాంగ్రెస్ నాయకులు అమర సేనా రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రేణుక ఫంక్షన్ హాల్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనంపల్లితో పెట్టుకుంటే మాడి మసైపోతావ్ అన్నారు. ఎమ్మెల్యే రోహిత్ రావును ఇంకొకసారి విమర్శించినట్లయితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో డిపాజిట్ కూడా దక్కని పంజా విజయ్ కుమార్ మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరి కాదన్నారు. సొంతంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ పల్లెల్లో నీటి ఎద్దడి లేకుండా మైనంపల్లి రోహిత్ రావు ఉచిత బోర్లు వేయిస్తున్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 5 సంవత్సరాలు జెడ్పీటీసీగా ఉండి, మండల కేంద్రానికి చేసిందేంలేన్నారు. ఎంఎస్ఎస్ఓ గూర్చి ఏం తెలుసని విమర్శించారన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో మెదక్‌లో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభించుకున్నామన్నారు. "అభివృద్ధి చూసి ఓర్వలేక మసిపూస్తున్నారని" విమర్శించారు. ఎంఎస్ఎస్ఓ గూర్చి బహిరంగ చర్చకు ఎంఎస్ఎస్ఓ నాయకులు సిద్ధంగా ఉన్నారని, దమ్ముంటే రమ్మని సవాల్ విసిరారు బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డిని ఓడించి అతి చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా గెలిచి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్‌లో చేర్చుకోలేనందుకే ఇలాంటి చవకబారు వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పంజా మహేందర్, మండల అధ్యక్షులు మారుతి, ఎంఎస్ఎస్ఓ మండల ఇన్చార్జి వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, నజిరుద్దీన్, ఆకుల బాలయ్య, సత్యనారాయణ రెడ్డి, ముత్యం రెడ్డి, వెంకటాపురం మధుసూదన్ రెడ్డి, రమావత్ వినోద్, రామ్ చందర్ నాయక్, శ్రీనివాస్ నాయక్, వై వెంకటేశం, సూర రాములు, నస్కల్ వెంకట్, మహేష్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ అంటేనే అబద్ధాలు చెప్పే పార్టీ

- ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాం

నవతెలంగాణ-నర్సాపూర్



బీజేపీ అంటేనే అబద్ధాలు చెప్పే పార్టీ అని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూలకంటి ఆంజనేయులు అన్నారు. మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు కలిసి కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో చేయని అభివృద్ధి సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ సంవత్సర కాలంలో చేసి చూపిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో అమలు చేసేందుకు సీఎం సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అవుతున్నందున ప్రజా పాలన విజయోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా డిసెంబర్ 7వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినందున ,డిసెంబర్ 9వ తేదీన సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సువాసిని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, నాయకులు మల్లేశం, శ్రీనివాసరావు ,రిజ్వాన్, రషీద్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్

నవతెలంగాణ-నర్సాపూర్

కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంగా ప్రజలకు చేస్తున్న మోసాలను వివరించేందుకు బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం సాయి కృష్ణ కళ్యాణ మండపంలో నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు నడుస్తున్న బాటలోనే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నడుస్తున్నారన్నారు. ఆరు అబద్దాలతో 66 మెసాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేస్తుందన్నారు. ఇచ్చిన 6 గ్యారంటీలలో ఎ ఒక్క గ్యారెంటీ ని కూడా సక్రమంగా అమలుపరచడం లేదన్నారు. ఎన్నికల సమయంలో యువతీల వివాహాలకు తులం బంగారం పెడతామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయకుండా యువతను మోసం చేశారన్నారు. నర్సాపూర్ లో జరిగిన ఎన్నికల బహిరంగ సభలో మెదక్ జోన్ ను చార్మినార్ జోన్ లో కలుపుతానని స్వయానా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చి ఇచ్చిన హామీని నేటి వరకు అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామపంచాయతీపై కాషాయం జెండా ఎగరవేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్ యాదవ్, రాష్ట్ర నాయకులు వాళ్దాస్ మల్లేష్ గౌడ్, రఘువీరారెడ్డి, ఓ బి సి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ గౌడ్, కౌన్సిలర్లు బుచ్చేష్ యాదవ్, రాజేందర్, సంఘసాని సురేష్ తదితరులు పాల్గొన్నారు.



అధికారుల నిర్లక్ష్యం మూలంగానే గ్రేడ్‌వన్ ఆపరేటర్ మృతి

- మృతికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలి
- టీవీఏసి జేఏసి జిల్లా చైర్మన్ స్వామి

నవతెలంగాణ-మనోహరాబాద్



విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే గ్రేడ్ వన్ ఆర్టిజన్ కార్మికుడు మృతి చెందాడని, మృతికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకుని, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని టీవీఏసీ జాక్ మెదక్ జిల్లా చైర్మన్ స్వామి డిమాండ్ చేశారు. టీవిఏసి జాక్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం మనోహరాబాద్ మండలంలోని కాళ్ళాకల్ సబ్‌స్టేషన్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ జిల్లా నర్సంపేట సబ్‌స్టేషన్‌లో గ్రేడ్ వన్ ఆపరేటర్‌గా కృష్ణ విదులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కాగా అధికారుల నిర్లక్ష్యం మూలంగానే కృష్ణ మృతి చెందాడన్నారు. దీనిని టీవిఏసి జేఏసి ఖండిస్తున్నట్టు తెలిపారు. కృష్ణ మృతికి అధికారులే కారణమని పేర్కొన్నారు. కృష్ణ మృతికి కారణమైన అధికారులను వెంటనే సస్పెండ్ చేసి క్రిమినల్ కేసులను పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. మృతి చెందిన ఆపరేటర్ కుటుంబానికి నష్టపరిహారంతో పాటు ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి న్యాయం చేయాలని టీవిఏసి జాక్ ద్వార డిమాండ్ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇక మీదట ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కానీ, యాజమాణ్యం కానీ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మృతి చెందిన ఆపరేటర్ కుటుంబాన్ని అన్ని విదాలా ఆదుకోవాలని తగిన న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు జరిగితే అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీవిజేఏసి జాక్ నాయకులు నాగరాజు, రాము, మన్సూర్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మండలానికి 108 అంబులెన్స్ మంజూరు



నవతెలంగాణ-నిజాంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మండలానికి 108 అంబులెన్స్ మంజూరి చేసినందుకు మండల ప్రజలు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మండలానికి 2,3 రోజులలో అంబులెన్స్ ప్రారంభించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. క్షతగాత్రులను, రోగాల బారిన పడిన వారిని, గర్భవతులను, తరలించడానికి 108 అంబులెన్స్ అవసరమని గతంలో ప్రభుత్వాలకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేవని, వందల మంది ప్రాణాలు గాల్లో కలిసిపోయాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. సమయానికి 108 అంబులెన్సులు రాకపోవడంతో రోగులు అనేక ఇబ్బందులకు గురయ్యారని గ్రామస్తులు పేర్కొన్నారు.

మండలానికి అంబులెన్స్ మంజూరు చాలా సంతోషం

నీల కనకరాజు, రజాక్ పల్లి నివాసి



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మండలంలో 108 అంబులెన్స్ లేక సమయానికి రాక ఎంతోమంది రోగులు, యాక్సిడెంట్లలో గాయాలైన వారి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. మండలానికి 108 అంబులెన్స్ మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు. ఎన్నో సంవత్స రాల నుంచి అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. అంబులెన్స్ మంజూరి చేసినందుకు ఎమ్మెల్యే రోహిత్ రావుకు ప్రత్యేక ధన్యవాదాలు.

గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు

నవతెలంగాణ-చిన్న శంకంపేట.



మండల కేంద్రంలో గంజాయి అమ్ముతున్న బీహార్ రాష్ట్రానికి చెందిన కార్మికుడు రాజును పోలీసులు అరెస్టు చేశారు. రామాయంపేట సిఐ వెంకట రాజా గౌడ్, చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి, స్థానిక ఎస్సై నారాయణ గౌడ్‌లు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. నమ్మదగిన సమాచారం మేరకు గంజాయి అమ్ముతున్నాడని తెలుసుకొని పై అధికారులకు సమాచారం అందించి ఎస్సై తాను సిబ్బందితో సోమవారం రాత్రి మండల కేంద్రంలోని పద్మ రాయుడు గుట్ట సమీపంలో గల మీర్జాపల్లి ఎక్స్ రోడ్ వద్ద ఓ వ్యక్తి కాలేజీ బ్యాగు ధరించి ఉన్నాడు గమనించిన పోలీసులు అనుమానంతో అతనిని విచారించగా అతడు సిగరెట్ తో పాటు గంజాయిని తాగుతూ అలవాటు పడ్డారని పోలీసులకు తెలిపారు. కంపెనీలలో పని చేస్తే వచ్చే డబ్బు తాగుడుకు ఇతర అవసరాలకు సరిపోయేవి కాదని గంజాయి వలన తాను కొంత సేవించి మిగతా గంజాయిని ఇతరులకు అమ్మితే అధికంగా డబ్బులు సులువుగా సంపాదించవచ్చని రాజు భావించాడు. అక్టోబర్ నెలలో బీహార్ వెళ్లి అక్కడ నుండి గంజాయి తెచ్చి ఇక్కడ అమ్ముతుండే వాడినని నిందితుడు తెలిపారు. అతని వద్ద నుండి 512 గ్రాముల గంజాయిని స్వాధీనం స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు పదివేల రూపాయలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు.

అమరుడు శ్రీకాంతాచారికి ఘన నివాళి



నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, బీ ఆర్ఎస్ గజ్వేల్ ఇంచార్జి ప్రతాప్ రెడ్డిలు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం శ్రీకాంతాచారి చేసిన త్యాగాన్ని స్మరించుకున్నామన్నారు. ఆయన ప్రాణ త్యాగం తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరువరన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్మెన్ ఎన్.సి రాజమౌళి, గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్ మున్సిపల్ వైస్ చైర్మెన్ జక్కియోద్దీన్ గజ్వేల్ మండల అధ్యక్షుడు బెండ మధు, గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, తదితరులున్నారు.

గణిత శాస్త్రంలో నాగపురి విద్యార్థి ప్రతిభ



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండలం ముస్త్యాలలోని మోడల్ స్కూల్ లో సోమవారం మండల స్థాయి గణిత శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం నిర్వహించిన టాలెంట్ టెస్టులో నాగపురి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి మడిపడిగె నందకిషోర్ తెలుగు మాధ్యమంలో మొదటి స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎలికట్టె అయిలయ్య తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థి తోపాటు గణిత శాస్త్ర ఉపాధ్యాయులు ఎస్. నిరూపమ. కే. మాధవి లను ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

బోధనోపకరణాలతో మెరుగైన విద్యాబోధన



నవతెలంగాణ- రాయపోల్

విద్యార్థుల బోధనభ్యసనకు బోధనోపకరణాలు ఎంతో ఉపయోగపడతాయని ఉపాధ్యాయులు వాటి ద్వారా విద్యాబోధన చేస్తే విద్యార్థులకు సులభంగా నేర్చుకుంటారని కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగ ాజు అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలకు శ్రీ వివేకానంద సొసైటీ సహకారంతో గణిత బోధనోపకరణాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల విద్యార్థులలో అంతర్గతంగా దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడానికి బోధనోపకరణాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఉపాధ్యాయులు పాఠ్యాంశాల బోధన చేయడమే కాకుండా ఇలాంటి బోధనోపకరణాల ద్వారా విద్యను బోధిస్తే విద్యార్థులకు ఎల్లప్పుడూ గుర్తుకు ఉంటాయని వారికి తొందరగా అర్థం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి పాఠశాల ఉపాధ్యాయులు వంశీ, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణానికి నష్టం కలిగిస్తే భూసారం దెబ్బతింటుంది

-మండల వ్యవసాయ అధికారి మల్లేశం



నవతెలంగాణ-మిరుదొడ్డి

పంటలు కోసిన వెంటనే రైతులు చేసే పొరపాటు పర్యావరణానికి నష్టం కలిగించడంతో పాటు భూసారం దెబ్బతినే పరిస్థితి నెలకొంటుందని మండల వ్యవసాయ అధికారి మల్లేశం అన్నారు. మిరుదొడ్డి మండల కేంద్రములోని వ్యవసాయ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ వరి పంట కోసిన తర్వాత గడ్డిని తగలబెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. గతంలో వరి పంట కోసిన తర్వాత కొద్ది రోజులపాటు నీటిని పొలంలో ఉంచి, చెట్ల కొమ్మలు, ఆకులు వేసి వాటిని కుల్లి పొయెటట్లు చేసేవారన్నారు. గడ్డిని తగలబెట్టడంతో పొలంలో రైతులకు మేలు చేసే సూక్ష్మజీవులు, క్రిమికీటకాలు చనిపోవడంతో పాటు దట్టమైన పొగతో పర్యావరణం దెబ్బ తింటుందన్నారు. గడ్డిని తగలబెట్టే సమయంలో మంటలు అదుపులోకి రాకపోవడంతో ఆస్తి నష్టం జరిగే అవకాశం లేకపోలేదని తెలిపారు. నేటికీ అక్కడక్కడ పంట పొలాలలో గడ్డిని రైతులు తగలబెట్టడం కనిపిస్తుందన్నారు. పంట కోసిన వెంటనే గడ్డి కుళ్ళిపోవడానికి సూపర్ పాస్పేట్ ఎకరాకు 50 కిలోల చొప్పున చల్లాలని వ్యవసాయ అధికారి మల్లేశం సూచించారు. తక్కువ సమయంలో, త్వరగా పంట కోసిన గడ్డిని తొలగించాలనే ఉద్దేశంతో గడ్డిని తగలబెట్టడం చేయవద్దన్నారు. సూపర్ పాస్పేట్ చల్లడం ద్వారా భూసారం పెరగడంతో పాటు, రైతులకు మేలు చేసే క్రిమి కీటకాలు వృద్ధి చెందుతాయని తెలిపారు. ఇలా చేయడం ద్వారా పంట దిగుబడి సైతం ఎక్కువగా వస్తుందని తెలియజేశారు.

సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న గురుకులాలు



నవతెలంగాణ -దౌల్తాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ గురుకులాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరశురాములు అన్నారు. మంగళవారం మండలంలో గురుకుల కేజీవీబీ హాస్టల్లు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు దౌల్తాబాద్ మండలంలోని లింగరాజ్ పల్లి మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాల, కేజీబీవీ హాస్టల్లను సందర్శించి సమస్యలు తెలుసుకోవడం జరిగిందన్నారు. విద్యార్థులకు కప్పుకోవడానికి దుప్పట్లు,కాస్మెటిక్ చార్జీలు, బూట్లను అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. విద్యార్థులకు కనీసం మెనూ ప్రకారం నాణ్యతమైన భోజనం అందించడం లేదన్నారు.కల్తీ ఆహారంతో రాష్ట్రవ్యాప్తంగా 40 మంది విద్యార్థులు ప్రాణాలు వదలాగా, అనేక మంది విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు యాదగిరి రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు సంబారపు నాగరాజు, దుబ్బాక నియోజకవర్గం ఇన్చార్జి పాపని సురేష్,పిట్ల రాకేష్,గొల్ల నవీన్,వేణు, చందు,గంగాపూర్ సాయి పాల్గొన్నారు.

నవతెలంగాణ-మిరుదొడ్డి

బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో గురుకులబాట అనే కార్యక్రమంలో భాగంగా దుబ్బాక నియోజకవర్గంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి సూరంపల్లి పరుశారాం, దుబ్బాక బీఆర్ఎస్వీ నియోజకవర్గ ఇంచార్జ్ పాపని సురేష్ ఆద్వర్యంలో నియోజకవర్గంలో ఉన్న గురుకులాల సంక్షేమ హాస్టళ్లలో సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు మౌలిక సదుపాయాలు సరిగా లేక నానా అవస్థలు పడుతున్న సందర్భం కొన్ని హాస్టళ్లలో నీటి సదుపాయం లేక బోరు నీళ్లే త్రాగడం.అవ్వే నీరు స్నానాలకు వాడుతున్న సందర్భంలో పిల్లలకు ఎలార్జి అయి దద్దులు వస్తు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. తరగతి గదులు లేక ఒక్కటే రూంలోనే డార్మిటరీ రూమ్, బోధన రూమ్ ఒక్కటే ఉండడం వల్ల విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదన్నారు. ఈ సందర్శన ద్వారా ఎన్నో సమస్యలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కేసిఆర్ విద్యార్థులు భవిష్యత్తు దృష్ట్యా గురుకులాలు ప్రవేశపెట్టి నాణ్యమైన భోజనం నాణ్యమైన విద్య అందించి ,విద్యార్థులకు బంగారు బాట వేస్తే ఈ ప్రభుత్వ హయాంలో రేవంత్ సర్కార్ విద్యార్థులకు ఈ సమస్యలతో శాపంగా మారిందని ఆవేదనను వ్యక్తం చేశారు. ఇప్పటికయినా ఈ పేద విద్యార్థులను సమస్యలుపై అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్వీ పక్షాన డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరుశారాం ,బిఆర్ఎస్వీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ పాపని సురేష్ గౌడ్ .బిఆర్ఎస్వీ జిల్లా సమన్వయ కర్త యాదగిరి, బిఆర్ ఎస్వీ నాయకులు చార్వాక కుమార్, హైమద్, ఐలయ్య,గుజ్జరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ న్యాయవాదుల దినోత్సవం



నవతెలంగాణ-గజ్వేల్

జాతీయ న్యాయవాదుల దినోత్సవం సందర్భంగా గజ్వేల్ లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఇటీవల గజ్వేల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్గా నియమితులైన అష్టకాల కిరణ్ సాగర్ను లోక్ సత్తా ఉద్యమ సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త, న్యాయవాది బండారు రామ్మోహన రావు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి, గజ్వేల్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ వంటేరు నరేందర్ రెడ్డి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మెన్ గొర్రె భాస్కర్ తదితరులు పాల్గొని యువ న్యాయవాది కిరణ్ సాగర్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు బెజగామ నాగేందర్ రావు అధ్యక్షత వహించగా, కార్యదర్శి బండారు రాంఫణిధర రావు హాజరయ్యారు. కార్యక్రమ సమన్వయకర్తగా ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయం ప్రధాన అర్చకులు దేశపతి రాజశేఖర శర్మ వ్యవహరించారు. అనంతరం బండారు రామ్మోహన రావు మాట్లాడుతూ ప్రపంచ న్యాయవాద వృత్తి దినోత్సవం, ప్రథమ రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ జయంతిని దేశంలో డిసెంబర్ 3వ తేదీ న్యాయవాదుల దినోత్సవం చేసుకుంటారని, ఈ సందర్భంగా న్యాయ వాదులకు శుభాకాంక్షలు తెలియజేశారు. న్యాయవాద వృత్తి స్వతంత్రమైనది, పవిత్రమైనదని, దీంతో ఈ వృత్తికి మంచి పేరు తేవాలని యువ న్యాయవాదులను కోరారు.సన్మానించడం యువ న్యాయవాదులకు స్ఫూర్తినిస్తుందన్నారు.

సింహ గర్జన విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు

- **ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ ర్యాకం శ్రీరాములు**



నవతెలంగాణ-రాయపోల్

చలో హైదరాబాద్ మాలల సింహగర్జన బహిరంగ సభకు సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసిన మాల ఆత్మీయ బంధువులందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సిద్దిపేట జిల్లా కన్వీనర్ ర్యాకం శ్రీరాములు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు చేపట్టిన సింహగర్జన భారీ బహిరంగ సభకు సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి స్వచ్ఛందంగా వేలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేసిన మాల సోదరులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఇదే చైతన్యం, ఐక్యమత్యం వర్గీకరణ రద్దయ్యేంత వరకు కొనసాగించాలని, రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు భవిష్యత్ ఉద్యమాన్ని కొనసాగిద్దామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోమాలమహానాడు సిద్దిపేట జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షులు మండల యాదగిరి, మిరుదొడ్డి మండల అధ్యక్షులు దార స్వామి, నాయకులు మిందే రమేష్, జీడిపల్లి రమేష్, కూతురు సుమన్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసమే ప్రజాపాలన

- **గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి**

నవతెలంగాణ-గజ్వేల్

ప్రజా సంక్షేమం కోసమే ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలో ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. గత సంవత్సరం కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారంటీలను అమలు చేసే ప్రయత్నం చేశామని ఆయన అన్నారు. మహిళలకు బస్సు ప్రయాణం ఎంతో సౌకర్యంగా ఉందని ఆయన చెప్పారు. బండ్లగూడెం మేయర్ పారిజాతం మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడి పల్లి భాస్కర్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, నక్క రాములు గౌడ్, అజ్గర్, సత్యం, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

